# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :79 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 24-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా సేవలు..

పెద్దపల్లి రూరల్ , మే 23: పెద్దపల్లి జిల్లాలో హింసకు గురవుతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా అవసరమైన సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష రంగంపల్లి లోని సఖీ సెంటర్ ను గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ హింసకు గురౌతున్న మహిళలకు సఖీ సెంటర్ ద్వారా రిలీఫ్ రావాలని, ఇటువంటి కెసుల పై అధిక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.సఖీ సెంటర్ కు వచ్చిన మహిళల సమస్య పరిష్కారానికి కృషి చేసి వారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సఖీ సెంటర్ కు వచ్చే బాధితులకు అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని, వివిధ కేసులలో అవసరమైన సందర్భంలో న్యాయ సలహా సైతం అందించాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని లో ఒక మహిళను, ఆమె పిల్లలను 3 సంవత్సరాల పాటు అక్రమంగా నిర్బంధించిన మెస్త్రీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గోదావరిఖని ఏసీపీని ఆదేశించారు.ప్రస్తుతం ప్రతీనెల దాదాపు 20 మంది మహిళలు సఖి సెంటర్ ను

## మీది 40 ఏళ్ల అనుభవం.. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తాం..



హైదరాబాద్,ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా?అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటున్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.రాష్ట్రానికి రావాల్సిన నిధులు కోసం ప్రధాని మోడీని ఎన్ని సార్లు అయిన కలుస్తామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే మనకే వాసన వస్తుందని.. ఒకాయన అలాగే అలిగి ఫామ్ హౌస్ లో పడుకున్నారని తీవ్రంగా విమర్శించారు. నేను మీ కోసం పని చేస్తా కష్టపడుతానన్నారు.అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. “జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. BHEL, BDL, NIMZ, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాం.” అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## ఉగ్రవాది తరహా వ్యాఖ్యలు చేసిన పాక్ ఆర్మీ అధికారి

ఇస్లామాబాద్: తీవ్ర ఉద్రిక్తతల వేళ భారత్‌పై పాక్ అధికారులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉగ్రవాద తరహాలో తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. తాజాగా పాక్‌కు చెందిన ఓ ఆర్మీ అధికారి భారత్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధు జలాల నీటిని అడ్డుకుంటే భారత ప్రజల ఊపిరి తీస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశంతో చేసుకున్న సింధు జలాల ఒప్పందం అమలును మన దేశం నిలిపివేయాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి తాజాగా మాట్లాడారు. పాక్‌లోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ‘మాకు వచ్చే నీటిని భారత్ అడ్డుకుంటే అక్కడి ప్రజల ఊపిరి ఆపేస్తాం. సింధూ నదిలో జలాలకు బదులుగా వారి రక్తం పారుతుంది’ అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. అహ్మద్ షరీఫ్ చౌదరి వ్యాఖ్యలు.. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ వ్యాఖ్యలకు అద్దం పడుతోంది.‘మీరు నీటిని ఆపేస్తే.. మేము మీ శ్వాసను ఆపేస్తాం. ఆపై సింధు నదిలో రక్తం పారుతుంది’ అని గతంలో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అలాంటి వ్యాఖ్యలే పాక్ ఆర్మీ అధికారి చేయడం గమనార్హం.



మరోవైపు సింధూ నదీ వ్యవహారంలో భారత ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయానికి గట్టిగా బదులిస్తామని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మెన్ బిలావల్ భుట్టో ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారత్ తన నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకున్నట్లు ఆయన ఖండించారు. సింధూ జలాలు మావే అని, అవి ఎప్పటికీ మా నీళ్లే అని, ఆ నదిలో మా నీళ్లు అయినా పారాలి లేక మీ రక్తమైనా పారాలని అని బిలావల్ తన వార్నింగ్‌లో పేర్కొన్నారు.

## ఉగ్రవాదుల ఉత్పత్తి కేంద్రం పాకిస్థాన్



న్యూఢిల్లీ,మే 23: దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఘటన జరిగిన ప్రతిసారీ తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నదని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మండిపడ్డారు. తమ నేలపై ఉగ్రవాదం లేదంటూ పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనలను ఆయన ఖండించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంలో పాకిస్థాన్ ప్రభుత్వంతోపాటు ఆ దేశ సైన్యం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యూరప్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా నెదర్లాండ్స్‌లో మంత్రి జై శంకర్ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన జాబితాలోని ఉగ్రవాదులంతా పాకిస్థాన్‌లోనే ఉన్నారన్నారు. వారంతా పెద్దపెద్ద నగరాల్లో నివసిస్తున్నారని చెప్పుకొచ్చారు. అక్కడి నుంచే వారు ఈ ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వారి చిరునామాలే కాదు.. ఎవరెవరితో వారు సంబంధాలు నెరుపుతున్నారో కూడా పాక్ ప్రభుత్వానికి తెలుసని వెల్లడించారు. అంతేకాదు వారంతా పట్టపగలు పాకిస్థాన్‌లో బహిరంగంగా తిరుగుతున్నారంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరిని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ విషయంలో భారత్ ఒక ఖచ్చితమైన ముగింపును మాత్రం కోరుకుంటుందన్నారు. తమకు పాకిస్థాన్‌పై ఆగ్రహం లేదని.. కానీ ఉగ్రవాదంపై ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పాకిస్థాన్‌లో లెక్కలేనన్ని ఉగ్రవాద స్థావరాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. అలాంటి పాకిస్థాన్.. తమ దేశానికి ఉగ్రవాదంతో ఎటువంటి సంబంధం లేదంటూ చెప్పడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. ఇరు దేశాల మధ్య కాల్పులు విరమణ ఒప్పందం ప్రస్తుతం కొనసాగుతుందని చెప్పారు. పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదం ఇదే రీతిగా కొనసాగితే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎదురయ్యే పరిణామాలను ఆ దేశం తప్పక ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి జై శంకర్ హెచ్చరించారు. అలాగే భారత్‌కు ఉగ్రవాదం, జమ్మూకాశ్మీర్ అంశాలు వేర్వేరని స్పష్టం చేశారు. ఉగ్రవాదం అనేది స్వతంత్రమైనది. అదే విధంగా పూర్తిగా ఆమోదయోగ్యం కాని అంతర్జాతీయ నేరమన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించకూడదని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక రంగాన్ని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు భారత్, పాకిస్థాన్‌ల మధ్య మధ్యవర్తిత్వానికి నెరపడానికి అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకు వచ్చినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని భారత్ తోసిపుచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాశ్మీర్ అంశంలో మూడో ప్రమేయాన్ని తాము అంగీకరించబోమని కూడా మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు.పాకిస్థాన్‌తో ఉగ్రవాదం, పీవోకెలపైనే తమ చర్చలు ఉంటాయని అన్నారు.

## రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థలను ఏపిలో ఏర్పాటు చేయండి

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌ను భారత రక్షణ, ఏరోస్పేస్ రంగాల భవిష్యత్తుకు ఒక మూలస్తంభంగా తీర్చిదిద్దే ప్రణాళికలలో భాగంగా థీమాటిక్ డిఫెన్స్ హబ్‌లు, డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ) అనుబంధ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఉత్కృష్టతా కేంద్రాలు) కేంద్రాలను ఏపిలో ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ ను ఏపి సిఎం చంద్రబాబు కోరారు.. భారతదేశాన్ని రక్షణ రంగంలో స్వావలంబన దిశగా నడిపించే ‘ఆత్మనిర్భర్ భారత్’ లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వివరించారు.. ఈ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో పలు డిఫెన్స్ సంస్థలు ఏర్పాటు చేయాలని, అందుకు తమ ప్రభుత్వం అని విధాల సహకరిస్తుందని తెలిపారు.ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు నేడు రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో రాజ్ నాథ్ ను కలసి వివిధ ప్రతిపాదనలను అందజేశారు. ఈ భేటీలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళికపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశం అద్భుతంగా, ఫలవంతంగా సాగిందని తెలిపారుఇక రాష్ట్రంలో వ్యూహాత్మక మౌలిక సదుపాయాల కల్పన, విధానపరమైన నూతన



ఆవిష్కరణల ద్వారా రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ప్రోత్సాహకరమైన స్పందన, మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆ కారణంతోనే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది



న్యూఢిల్లీ,ప్రధాని మోడీ బలమైన సంకల్పం.. నిఘా సంస్థల కచ్చితమైన సమాచారం.. సాయుధ దళాల అద్భుత ప్రదర్శన వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిందని హోంమంత్రి అమిత్ షా అన్నారు.న్యూఢిల్లీలో జరిగిన సరిహద్దు భద్రతా దళం ఇన్వెస్టిచర్ వేడుక మరియు రుస్తంజీ స్మారక ఉపన్యాసం సందర్భంగా అమిత్ షా ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్ఎఫ్ ప్రదర్శించిన ఆదర్శప్రాయమైన పనితీరును ప్రశంసించారు. సరిహద్దు వెంబడి జరుగుతున్న దుష్ట కార్యకలాపాలను బీఎస్ఎఫ్ దళం సమర్థవంతంగా అడ్డుకున్నట్లు చెప్పారు.భారత్‌లో ఉగ్రవాదానికి పాకిస్థానే స్పాన్సర్ అని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదానికి దీటైె జవాబు ఇచ్చామని చెప్పారు. పహల్గామ్ దాడులతో అన్ని హద్దులు దాటిన ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించడానికి.. వారి స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిందన్నారు. పాక్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను భారత్ బయటపెట్టడంతో.. ఆ దేశం ఉగ్రవాదులను పోషిస్తుందనే నిజం మరోసారి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచమంతా కొనియాడిందని అమిత్ షా పేర్కొన్నారు.బంగ్లాదేశ్‌తో సహా అంతర్జాతీయ సరిహద్దులను కాపాడటంలో బీఎస్ఎఫ్ పాత్రను అభినందించారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పిదాల వల్ల భారత్ అనేక దశాబ్దాలుగా ఉగ్ర సమస్యను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి భారత్ ఉగ్ర దాడులకు గట్టి బదులిస్తోందని అన్నారు. పహల్గామ్ ఘటన సమయంలో ఉగ్రవాదులు పర్యాటకులను మతం అడిగి మరీ చంపడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.ఆపరేషన్ సిందూర్‌లో కేవలం ఉగ్రవాద స్థావరాలే ధ్వంసమయ్యాయని.. ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. కానీ పాక్ సైన్యం మాత్రం నిషేధిత ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరై.. ఉగ్రవాదానికి మద్దతు పలికారని అమిత్‌షా అన్నారు. వారి చర్యలను ప్రపంచం మొత్తం చూసిందని.. ఉగ్రవాదుల వెనక ఎవరు ఉన్నారనే విషయం అన్ని దేశాలకు అర్థమయ్యిందని తెలిపారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారింది..

హైదరాబాద్,తెలంగాణా రాష్ట్రం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం స్థితిలోకి మారిపోయిందని, ఇది ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా ఒప్పుకుంటున్న విషయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.ఎక్స్ వేదికగా కేటీఆర్.. తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు స్కాంగ్రెస్.. కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం గా మారింది. ఈడి లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా ఇదే చెబుతున్నాయి. తెలంగాణ బ్యాగ్ మ్యాన్ రేవంత్ రెడ్డి పేరును ఈడి తన చార్జ్ షీట్ లో నమోదు చేసింది.. తన పేరు ఈడి చార్జిషీట్‌లో రావడంతో రేవంత్ రెడ్డి టెన్షన్ డైవర్షన్ డ్రామాలు మొదలుపెట్టాడన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రతిరోజూ కొత్త నాటకాలు చేస్తున్నాడని, తన అవినీతిని చర్చించకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈడీ చార్జిషీట్ లో రేవంత్ రెడ్డి పేరు వచ్చిన తర్వాత అయినా కేంద్రం చర్యలు తీసుకుంటుందా లేదా? అని ఆయన ప్రశ్నించారు. అమృత్ స్కాం, ఆర్ఆర్ టాక్స్ స్కాం, సివిల్ సప్లై స్కాం వంటి వాటిలో ఇంతకుముందు వదిలేసినట్లుగా వదిలేస్తుందా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారిందన్నారు కేటీఆర్.అంతేకాకుండా..’నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు పెట్టడంతో.. సీఎం అవినీతి బండారం మొత్తం బయటపడింది. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టాడని ఈడీ నమోదు చేసిన చార్జిషీట్ తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయింది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి – పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటాడా ఈడీ, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా ? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా రాష్ట్ర కాంగ్రెస్ లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైంది. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోంది. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టే.



సీఎం రేవంత్ కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినై.. కమీషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయి. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోంది. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది. చివరికి ధర్మం గెలుస్తుంది..’ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### కారు –లారీ ఢీ : ఆరుగురు దుర్మరణం

గిద్దలూరు, ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్నఆరుగురు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను బాపట్ల జిల్లా స్టూవర్టుపురం వాసులుగా గుర్తించారు. వీరంతా మహానంది పుణ్యక్షేత్రంలో దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో కారులో 8 మంది ఉన్నారు.సమాచారం అందుకున్న గిద్దలూరు రూరల్ సీఐ జే. రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. మృతుల సమాచారాన్ని వారి బంధువులకు తెలియజేశారు.

## పెద్దమ్మగుడి వద్ద ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్, ఎలాంటి ఆక్రమణలు ఉన్నా హైడ్రా చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా పెద్దమ్మ గుడి వద్ద ఆక్రమణలను హైడ్రా నేలమట్టం చేసింది. హైదరాబాద్?లో భూములను పరిరక్షించడమే లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా.. అదే బాటలో చర్యలు తీసుకుంటుంది. బుధ, గురువారాల్లో మేడిపల్లి పరిధిలో ఆక్రమణలు కూల్చేసిన హైడ్రా.. నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి దగ్గర ఆక్రమణలను కూల్చేసింది.పెద్దమ్మగుడి పక్కన నాలాను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఉదయం ఆరు గంటల నుంచి కూల్చివేతలు కొనసాగాయి. నాలా పై నిర్మించిన నిర్మాణాలు, షెడ్లను కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదుతో సర్వే నిర్వహించిన అధికారులు.. నాలా ను ఆక్రమించి నిర్మించినట్లు



గుర్తించారు. దీంతో 500 గజాలకు పైగా స్థలంలో నిర్మాణాలను కూల్చివేశారు

## సంపాదకీయం

శనివారం 24-05-2025

# ప్రకృతి విధ్వంసంతో అత్యంత ప్రమాదం !

ధర్మో రక్షతి రక్షితః..ఇది భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుంది. అలాగే ప్రకృతిని మనం కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటుంది. భారతీయ సనాతన ధర్మం అంతా ప్రకృతిని పూజించడం, జీవ వైవిధ్యం గురించి వివరించడం జరిగింది. గాలి,నీరు, భూమి, ఆకాశం, అగ్ని అనే పంచభూతాలను పూజించాలన్నది అందుకే. అంటే ఇవి మనిషి మనుగడకు తోడ్పడుతాయి కనుక వాటిపట్ల మనం కృతజ్ఞతగా ఉండాలని భారతీయ సంస్కృతి చెబుతోంది. అంటే పూజించడమనే కాదు..రక్షించడం..కాపాడుకోవడం అన్న పరమార్ధం ఉంది. చెట్లను, పుట్టను పూజించడం వెనక ఉన్న మర్మం కూడా ఇదే. జీవవైవిధ్యం అనగా భూమిపైగల వివిధ రకాల జీవజాతులను రక్షించుకోవడం. జీవవైవిధ్యం కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తిని కాపాడిన వారం అవుతాం. అందుకు ప్రధానంగా పంచభూతాలను రక్షించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి విధ్వంసం మొదలైన తరవాతనే మానవాళికి ముప్పు ఏర్పడిందని గుర్తించాలి. కరోనాలాంటి వైరస్‌లు వచ్చినా తట్టుకునే స్థితిలో మనం లేమంటే..అందుకు మనం ప్రకృతిని నాశనం చేయడమేనని తెలుసుకోవాలి. మానవ తప్పిదాల కారణంగా లేదా విధ్వంసం కారణంగా జీవజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించిపోతోంది. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహన పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే22 న 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని' జరుపు కోవాలని నిర్ణయించింది. మనం పూజా పునస్కారాలతో మన ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేశాం. దీనిని తరవాతి తరం వారు ఈ పూజలేంటని విస్మరిస్తూ వచ్చారు. అంటే మనకు జీవనాధారంగా ఉన్న ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ వస్తున్నాం. భారతీయ సంస్కృతిలో జీవవైవిధ్యాన్ని పూజించటం, దైవస్వరూపంగా భావించటం గొప్పవిషయం. అందులో భాగంగానే చెట్లు,చేమ, పశు పక్ష్యాదులను పూజించడం జరుగుతోంది. జీవవైవిధ్యంలోని జీవజాతులు వివిధ రకాల సేవలను, ప్రయోజనాలను మానవ జాతికి, పర్యావరణానికి అందిస్తాయి. ఉదాహరణకు మానవులు, ఇతర జీవజాతుల జీవనక్రియలో భూమిపై విడుదల అయ్యే వ్యర్ధ పదార్థాలను భూమిలోని సూక్ష్మజీవులు కృశింపచేసి భూమిని సారవంతం చేయుటలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ పర్యావరణ సేవలను కేవలం సూక్ష్మజీవులు మాత్రమే నిర్వహించ గలవు. జామకాయ, ఆపిల్, ఉసిరి, కూరగాయలు వంటివి ఆహారంగా పనికి వస్తాయి. అదేవిధంగా వేప, తులసి మొదలగువాటిని ఔషధాలుగా ఉపయోగపడుతున్నాయి. వివిధ జీవజాతులు ఒక నిర్దిష్టమైన పనికి లేదా పర్యావరణ సేవలకు ఉపయోగపడతాయు. అదేవిధంగా కొన్ని నిర్దిష్టమైన జంతువులు మాత్రమే మానవులు ఆహారంగా తినటానికి అనువైనవి. ఉదాహరణకు కోడిమాంసం, గొర్రె, పొట్టేలు మాంసం, జలచరాలు అయిన చేపలు మొదలగునవి తినటానికి అనువైనవి. ఇవి ఆరోగ్యానికి మంచిది. మానవ ఆహారం 80 శాతానికి పైగా మొక్కల ద్వారా అందుతోంది. ఆవు పాల ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఆవుపాల ఉత్పత్తులకు విశిష్ట స్థానం కలదు. ముఖ్యంగా చిన్న పిల్లలకి ఆవుపాలు ఎంతో మేలుచేస్తాయి. ఆవు నెయ్యి మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచటమే కాక ముఖ్యమైన విటమిన్లను కలిగి ఉంటుంది. ఆవు పాల ఉత్పత్తుల ను హిందూమత పూజా కార్యక్రమాలలో, శుభ కార్యక్రమాలలో విరివిగా వాడటానికి కారణం ఇదే. భారతీయ సంస్కృతిలో ఆవు ఒక భాగం. ఆవు జీవవైవిధ్యంలో అత్యంత ప్రయోజనకరమైన జంతువు. ఆవు పాలే కాదు దాని పేడ, మూత్రం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవవైవిధ్యంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆవును చంపి మాంసాహారంగా తీసుకోవడం వల్ల మన ప్రకృతిని మనమే ధ్వంసం చేస్తున్నాం. ఆవును పూజించాలన్న ఓ బృహత్తర కార్యక్రమం వెనక కేవలం జీవవైవిధ్య పాత్ర ఉందని చెప్పాలి. ఈ క్రమంలో పశుమాంసానికి అలవాటు పడడం వల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోతోంది. పాలు ఇచ్చే సాధు జంతువులు అయిన గేదె,ఆవులు సంఖ్య తగ్గిపోవటం వలన డిమాండ్‌కు తగినవిధంగా పాల ఉత్పత్తి ఉండటం లేదు. జీవవైవిధ్యం నశిస్తే మానవ జాతి కూడా నశిస్తుంది. పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న పశువులను మాంసానికి వినియోగించరాదన్న డిమాండ్ వెనక ఉన్న పరమార్థాన్ని గుర్తించాలి. గోవును పూజించాలన్న పూర్వీకుల ఆచారం వెనక ఎంతటి పరిశోధన ఉందో గమనించాలి. మాంసాహారం తప్పు కాదు. కానీ సమాజానికి అత్యంత అవసరమైన జంతువులను తినడం సరైనది కాదు. ప్రజలు జీవవైవిధ్యానికి ఏది ముఖ్యమో, ఆహారానికి ఏది అవసరమో శాస్త్రీయంగా ఆలోచించాలి. జీవవైవిధ్యం మనుగడ సాగించగలదు. తద్వారా మానవాళి భూమిపై ఆనందంగా జీవనం కొనసాగించగలదు. జీవవైవిధ్య విధ్వంసం వల్లనే కరోనా వైరస్, సార్స్, ఎబోలా వంటి వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తున్నాయి. జీవవైవిధ్యం కోల్పోతే లేదా విధ్వంసానికి గురయితే మానవులు ఆరోగ్యంతో సహా అన్నింటినీ కోల్పోతారు. కాబట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూడరాదు. మానవుని అనాలోచిత చర్యల వల్ల వాతావరణంలో కలుగుతున్న మార్పుల వల్ల తోడు, భూమ్మీద నివసిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియో గించుకుంటూ, కలుషితాలను తిరిగి ప్రకృతిలోకి విడుదలచేయటం జరుగుతున్నది. నిత్యం పెద్దయెత్తున్న వెడజల్లబడుతున్న కలుషితాలు, విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూతాపోష్ణాగ్రత గతంలో ఎన్నడూ లేనంతగా పెరుక్కుతుంది. పెరుగుతున్న భూతాపం, భూమ్మీద నివసిస్తున్న సకల జీవరాశుల మనుగడ తీవ్ర సంక్షోభానికి గురి చేస్తుంది. అందుకే మానవ మనుగడలో అత్యంత కీలకమైన పాత్రను పోషించిన జీవరాశులను రక్షించు కోవాల్సిన భాధ్యత సమస్త మానవాళిపైన ఉంది. అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న పర్యావరణ వినాశకర కార్యక్రమాల వల్ల జీవవైవిధ్యం అత్యంత వేగంగా విధ్వంసానికి గురవుతున్నది. దీనికి మనమే రక్షకులుగా నిలవాలి. పర్యావరణాన్ని కాపాడాలి. ప్రకృతిని రక్షించుకోవాలి. అప్పుడే మానవమనుగడ సాగుతుంది.

# మానవ మనుగడకు సవాల్‌గా పర్యావరణ విధ్వంసం



న్యూఢిల్లీ,వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల భూమ్మీద నివసిస్తున్న కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. పెరుగుతున్న కాలుష్యం, జనాభా పెరుగుదల, రెట్టింపవుతున్న భూతాపం, సహజ వనరుల క్షీణత, వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, విచ్ఛిన్నమవుతున్న ఓజోన్ పొర వంటి పర్యావరణ విపత్తుల వల్ల కోట్లాది జీవులు తమ మనుగడను కోల్పోయే దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. 1972లో స్టాక్‌హోంలో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సు 'వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల భూమ్మీద నివసిస్తున్న కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఆందోళన వ్యక్తం చేసింది. పారిశ్రామిక యుగం ప్రారంభమైన అనంతరం వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూతాపం పెరుగటం వల్ల విలువైన జీవవైవిధ్యం ధ్వంసమైపోతుందని తెలిపింది. ఈ విధ్వంసాన్ని అరికట్టకపోతే రానున్న రోజుల్లో మానవాళి కూడా అనేక విపరిణామాను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ సదస్సు హెచ్చరించింది. ఐక్యరాజ్యసమితి ఒత్తిడి మేరకు 1997లో జపాన్‌లోని క్యోటోలో జరిగిన వాతావరణ సదస్సులో జీవరాశి మనుగడకు ప్రమాదంగా మారిన భూతాపానికి కారణమైన కర్బన్ ఉద్గారాలను కట్టడి చేయాలని, తద్వారా 1990 నాటి ఉష్ణోగ్రతల కన్నా 2 శాతం మించకుండా అన్ని ప్రపంచ దేశాలు చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా పెరుగుతున్న భూఉష్ణోగ్రతల వల్ల కోట్లాది జీవుల మనుగడ ప్రమాదంలో పడింది. పెరుగుతున్న భూతాపం వల్ల ప్రతి సంవత్సరం 27వేలకు పైగా జీవజాతులు అంతరించిపోతున్నాయి. ఇదే పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న 30 సంవత్సరాలలో 20 శాతం జీవజాతులు పూర్తిగా అంతరించిపోతాయని జీవవైవిధ్య పితామహుడుగా పేరుగాంచిన ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త, ఎడ్వర్డ్.ఒ.విల్సన్ హెచ్చరించారు. అధికమవుతున్న భూతాపం ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా 24 శాతం క్షీరద జాతులు, 12 శాతం పక్షిజాతులు అంతరిచిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే 75 శాతం జన్యుపంటలు అంతరించిపోయాయి. రానున్న 20 సంవత్సరాలలో భూమ్మీద నివసిస్తున్న 620 రకాల వానర జాతులలో 120పైగా వానర జాతులు అంతరించిపోతాయంటున్న జీవశాస్త్రవేత్తలు, ఇప్పటికే ఈ పక్రియ ప్రారంభమయ్యిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలతోపాటు వేగంగా తరిగిపోతున్న అటవీ వనరులు కూడా జీవరాశి మనుగడపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. భూమండలం మీద 90 శాతం జీవవైవిధ్యానికి ఆవాసాలుగా అలరారుతున్న సమశీతోష్ణ మండలాలలోని సతత హరితారణ్యాలు పెద్దయెత్తున నరికివేతకు గురికావటం వల్ల ఏటా 27 వేల జీవజాతులు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ అడవులు ఏటా 2 బిలియన్ టన్నుల కర్బన్ డై యాక్సైడ్‌ను శోషించుకుని భూతాపాన్ని తగ్గించడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. గడిచిన ఒక్క దశాబ్దంలోనే సుమారు 12 లక్షల హెక్టార్ల అడవులు నరికివేతకు గురయ్యాయని అంచనా. ఇప్పటికే సృష్టిలోనే అత్యంత అరుదైన జీవజాతులకు రక్షణ కేంద్రాలైన పగడపు దిబ్బలు 75 శాతం పైగా ధ్వంసమైపోయాయి. ఉష్ణోగ్రతలు ఇదే స్థాయిలో పెరుగుతూపోతే అతి తక్కువ కాలంలోనే పగడపు దీవులు భూమ్మీద నుండి శాశ్వతంగా అదృశ్యమైపోయే అవకాశముంది.ప్రపంచ జీవవైవిధ్యంలో 8? వాటాను కలిగిన భారతదేశం అత్యంత జీవవైవిధ్యం కలిగిన దేశాల జాబితాలో 7వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అరుదైన జీవవైవిధ్యాన్ని కలిగిన ఆస్ట్రేలియా మొదటిస్థానంలో ఉంటే, బ్రెజిల్ రెండవ స్థానంలో ఉంది. ప్రపంచ దేశాలు అవలంబిస్తున్న పర్యావరణ వ్యతిరేక విధానాల వల్ల భూమ్మీద సమస్త జీవరాశుల మనుగడ సంక్షోభంలో చిక్కుకుంది. పరిమితమైన వనరులను వినియోగించుకుని, అపరిమితమైన ఆర్థికవృద్ధిని సాధించే దిశగా పారిశ్రామిన దేశాల ఆలోచన చేయాల్సిన సమయమిది. అప్పుడు మాత్రమే సహజవనరులపై ఒత్తిడి తగ్గి తిరిగి అవి పునర్జీవించే అవకాశముంటుంది. పెద్దయెత్తున కోల్పోయిన జీవావరణాన్ని తిరిగి పునరుద్ధరించగలిగితేనే కోల్పోయిన జీవవైవిధ్యాన్ని కూడా తిరిగి రక్షించుకోగలుగుతాం. దురదృష్టకరమైన అంశమేమిటంటే, ఇంతటి పర్యావరణ సంక్షోభంలో కూడా పారిశ్రామిక దేశాలు తమ వైఖరికి మార్చుకోకపోగా, మరింత అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి వల్ల కలుగుతున్న అనర్థాలు కళ్ల ముందు కనబడుతున్న ఈ దశలో వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి పర్యావరణ రక్షణకు సిద్ధం కాకపోతే కోట్లాది జీవులకు అమ్మగా భావించే భూమాత మరుభూమిగా మారిపోతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. అదే జరిగితే మనిషి తన మరణ శాసనం తాను రాసుకున్నట్టే. గోవు ద్వారా అనేక పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు పొందటమేకాక గ్రామీణ ప్రజల ఆర్థికవృద్ధికి కూడా ఆవు ఎంతో తోడ్పడుతోంది. ఆవు పేడను ముఖ్యంగా పొడి రూపంలో చల్లితే ఖర్జూర పంట దిగుబడిని గణనీయంగా పెంచుతుందని పరిశోధనల ద్వారా తెలియవచ్చింది. అందుకనే గల్ఫ్ దేశాలు.. సౌదీ అరేబియాతోపాటు, కువైట్, యూఏఈ మొదలైన దేశాలు భారతీయ ఆవు పేడను ప్రధానంగా దిగుమతి చేసుకుంటున్నాయి. ఉదాహరణకు 2023?-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం దాదాపు రూ. 400 కోట్ల విలువైన ఆవు పేడ, సంబంధిత ఉత్పత్తులను ఎగుమతి చేసింది. రూ.125 కోట్ల విలువైన ఆవుపేడ, రూ.173.57 కోట్ల విలువైన ఎరువులను, రూ.88.02 కోట్ల విలువైన కంపోస్ట్ ఎరువులను భారత్? ఎగుమతి చేసింది. ఈ ఎగుమతుల పెరుగుదల భారతదేశ వ్యవసాయ ఎగుమతులను బలోపేతం చేయడమే కాకుండా కొత్త ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయి.

# పాక్‌ను ఒంటరి చేసేలా.. భారత్ పక్కా ప్లాన్

న్యూఢిల్లీ,దేశంలో ప్రస్తుతం ఒక పెద్ద చర్చ జరుగుతోంది. ఉగ్రవాదంపై పాక్ పాత్రను ప్రపంచదేశాలకు చెప్పేందుకు ఏడుగురు అఖిలపక్ష బృందాన్ని మోడీ ఎంపిక చేయడం వెనుక స్ట్రాటజీ గురించి హాట్ డిబేట్ నడుస్తోంది. కాంగ్రెస్ పేరు ఇవ్వని శశిథరూర్ ను ఎంపిక చేయడం కీలకంగా మారింది. ఇది విస్తృత చర్చకు దారి తీసింది. మోడీ మాస్టర్ స్ట్రోక్ లో ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నది అర్థం చేసుకోవచ్చు. ఒకటి అంతర్జాతీయంగా పాకిస్తాన్ ను ఏకాకి చేయడం, రెండోది ప్రతిపక్ష కాంగ్రెస్ కు చెక్ పెట్టడం. మరి ఏం జరగబోతోంది?

పాకిస్తాన్ పాపాలు బయటకు ఎలా తెలియాలి? ఎలా చెప్పాలి?

పాకిస్తాన్ పాపాలు బయటకు ఎలా తెలియాలి? ఎలా చెప్పాలి? వారి తీరును ఎలా ఎండగట్టాలి.. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదం ఎలాంటి నష్టాలు కలిగిస్తోంది.. ఆపరేషన్ సిందూర్ జరిగిన తీరు ఇలాంటి విషయాలను ప్రపంచదేశాలకు వివరించబోతోంది భారత్. అంతే కాదు.. మనం కేవలం పాక్ ఉగ్రస్థావరాలు, అలాగే వారి ఎయిర్ బేస్ లపై దాడి చేస్తే.. పాక్ మాత్రం భారత్ లోని సామాన్య జనాన్ని టార్గెట్ చేసుకుంది. ఈ విషయాలను కూడా ఆధారాలతో సహా వివిధ దేశాలకు భారత్ వివరించబోతోంది.

ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాలు

ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు చుక్కలు చూపిన భారత్.. ఇకపై దౌత్యపరంగా కూడా పాక్ కు పెద్ద షాకే ఇవ్వబోతోంది. అసలు పాకిస్తాన్ ఎలాంటి దేశం.. వారు చెప్పే మాటలకు, చేతలకు అసలు సంబంధం ఉందా అన్న విషయాలను ప్రపంచదేశాల దృష్టికి తీసుకెళ్లబోతోంది. ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాలు మే 23 నుంచి 10 రోజుల వాషింగ్టన్, లండన్, అబుదాబి, ప్రిటోరియా, టోక్యో వంటి కీలక రాజధానులను కవర్ చేస్తుంది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదన్న సందేశాన్ని ఇవ్వబోతున్నారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యులతోనూ భేటీ

కేంద్రం ఎంపిక చేసిన ప్రతినిధి బృందాలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యులతోనూ భేటీ జరుపుతారు. ఈ ప్రతినిధులు భారత్ జాతీయ ఏకాభిప్రాయాన్ని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో కచ్చితమైన విధానాన్ని తెలియజేస్తారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేదే లేదన్న సందేశాన్ని తీసుకెళ్లనున్నారు. సో మోడీ తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయంగా పాకిస్తాన్ కు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తడం ఖాయమే. ప్రతినిధుల బృందం ప్రపంచదేశాలకు వెళ్లడం ద్వారా భారత్ తన వైఖరిని అంతర్జాతీయ సమాజం ముందు స్పష్టంగా చెబుతుంది. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న విషయాన్ని ఆధారాలతో వివరించడం వల్ల యునైటెడ్ నేషన్స్ వంటి వేదికలపై భారత్‌కు సపోర్ట్ పెరిగేలా చూసుకుంటుంది.

పాకిస్తాన్ మారుతుందా మారదా అన్న విషయాలను పక్కన పెడితే..

పాకిస్తాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడికి ఒక అవకాశం ఏర్పడుతుంది. అఖిలపక్ష బృందం వివిధ దేశాలకు వెళ్లి ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్తాన్ ఇస్తున్న సపోర్ట్ ను బహిర్గతం చేయడం వల్ల ఆ దేశంపై దౌత్యపరంగా ఒత్తిడి పెరుగుతుంది. దీంతో పాకిస్తాన్ మారుతుందా మారదా అన్న విషయాలను పక్కన పెడితే.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ లో పాకిస్తాన్ కు ఇబ్బందికర పరిస్థితి తీసుకురావచ్చు. నిధులు, రుణాల లభ్యతను చాలా వరకు తగ్గించవచ్చు.

ఖిలపక్ష బృందంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు

అఖిలపక్ష బృందంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉండటం వల్ల ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ ఐక్యత, ఇక్కడి ప్రజాస్వామ్యం విషయాన్ని అంతర్జాతీయంగా బలంగా కనిపించేలా చేయబోతోంది. ఇది భారత్ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుంది. భారత్ ప్రతినిధులు ఇచ్చే ఆధారాలతో లష్కరే తొయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఇచ్చే సపోర్ట్ ను




బహిర్గతం చేయడం వల్ల ఈ సంస్థలపై ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించే ఛాన్సెస్ పెరుగుతాయి.

భవిష్యత్ లో పాకిస్తాన్ పై పూర్తిస్థాయి యుద్ధం చేసే పరిస్థితి

అఖిలపక్ష బృందం ప్రపంచ రాజధానులలో చర్చలు జరపడం వల్ల భారత్‌తో ఇతర దేశాల భద్రతా సహకారం పెరుగుతుంది. ఇది డిఫెన్స్ డీల్స్ ను మరింత పెంచుతుంది. ఉగ్రవాద నిరోధక చర్యలలో సమాచార భాగస్వామ్యం, సైనిక సహకారం వంటివి పెరగబోతున్నాయి. ఇక్కడే మనకు మోడీ మాస్టర్ స్ట్రాటజీ అర్థమవుతుంది. అంటే భవిష్యత్ లో పాకిస్తాన్ పై పూర్తిస్థాయి యుద్ధం చేసే పరిస్థితి వస్తే ఏ దేశం కూడా అడ్డు చెప్పకుండా స్కెచ్ రెడీ చేసి పెడుతున్నారు. పాకిస్తాన్ కు కావాల్సిందే అని ప్రపంచదేశాలు మాట్లాడేలా చూస్తున్నారు. అప్పుడు చర్చలు అంటూ ఏ దేశం కూడా చెప్పే పరిస్థితి లేకుండా చేస్తున్నారు.

కశ్మీర్ విషయంలో భారత్ వైఖరిని బలోపేతం చేయడం లక్ష్యం

పాకిస్తాన్ ఉగ్రవాదానికి సపోర్ట్ ఇస్తున్నట్లు ఆధారాలతో వెల్లడించడం వల్ల ఆ దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ఇది ఆర్థిక ఆంక్షలు, చైనా, టర్కీ వంటి దేశాలను మినహాయిస్తే.. దౌత్యపరంగా ఒంటరి అయ్యేందుకు ఛాన్సెస్ పెరుగుతాయి. వీటితో పాటే.. కశ్మీర్ విషయంలో భారత్ వైఖరిని బలోపేతం చేయడం లక్ష్యం. కశ్మీర్‌లో శాంతి, ప్రజాస్వామ్యం బలంగా ఉన్నాయని, పాకిస్తాన్ ఉగ్రవాద చర్యల వల్ల ఈ ప్రాంతంలో అశాంతి నెలకొంటోందని ఎక్స్ పోజ్ చేసే ఛాన్స్ ఉంది.

భవిష్యత్ లో ఉగ్రదాడులకు భారత్ రియాక్షన్ ఎలా ఉంటుందో చెప్పడం

ఈ దౌత్య చర్యలు పాకిస్తాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను బలవంతంగా ధ్వంసం చేసేందుకు దారి తీస్తాయి. దీనివల్ల దక్షిణాసియాలో దీర్ఘకాలిక శాంతి, స్థిరత్వం సాధ్యమయ్యే ఛాన్స్ ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి పాక్ రెచ్చగొట్టే చర్యలు ఎలా కారణమయ్యాయో చెప్పడం, భవిష్యత్ లో ఉగ్రదాడులకు భారత్ రియాక్షన్ ఎలా ఉంటుందో చెప్పడం, పాకిస్తాన్ పౌరులకు హాని చేయకుండా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయాన్ని ప్రస్తావించడం, కీలకంగా మారబోతున్నాయి.

ఆపరేషన్ సిందూర్ 2.0 రెడీ

మరోవైపు పాకిస్తాన్ ను అన్ని రకాలుగా ఇబ్బంది పెట్టేందుకు సిందూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది భారత్. అంతే కాదు పాకిస్తాన్ తో అన్ని రకాల వాణిజ్యాలను క్లోజ్ చేసింది. ఇప్పుడు పాకిస్తాన్ శాంతి చర్చలు అంటూ కాళ్లబేరానికి వస్తున్నా ఇప్పుడే మోడీ స్ట్రాటజీ మరో లెవెల్ లో ఉండబోతోందంటున్నారు. మొత్తంగా ఈ చర్య భారత్‌కు అంతర్జాతీయ గుర్తింపు, దౌత్యపరమైన బలం, ఉగ్రవాద నిరోధక కెపాసిటీని పెంచడమే కాకుండా, పాకిస్తాన్ బాధ్యతగా ఉండేలా ఒత్తిడి తేవడం లక్ష్యంగా ఉన్నాయి. మారితే సరే. లేకపోతే ఆపరేషన్ సిందూర్ 2.0 రెడీగా ఉంది. దాన్ని తట్టుకోవడం ఇక పాకిస్తాన్ తో కాదు. చేతులెత్తేయాల్సిందే.

# అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

కరీంగనర్,గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు.అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ఎ÷-లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బ్జడెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి-కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ అభినందనలు

అమరావతి, కర్ణాటక నుంచి ఏపీకి కుంకీ ఏనుగులు రప్పించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు చేశారు. 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు సోదరుల కష్టాలకు చెక్ పెట్టేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పించిన డిప్యూటీ సీఎం పవనన్నకు నా శుభాభినందనలు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఏనుగుల విధ్వంసంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలమనేరు ప్రాంత రైతన్నలు నా దృష్టికి తెచ్చారు. అన్నదాతల ఇక్కట్లను తొలగించేందుకు పవనన్న ప్రత్యేకంగా చొరవ చూపి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించారు. ఏపీ అవసరాలకు మరిన్ని కుంకీ ఏనుగులు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి కూడా నా కృతజ్ఞతలని లోకేశ్ పేర్కొన్నారు.

# వైసీపీ సిద్ధమా ?

అమరావతి,ఏపీలో టీడీపీ కూటమి బలంగా ఉంది. ఎంత బలంగా అంటే మరో నాలుగేళ్ల తరువాత ఏపీలో జరిగే ఎన్నికల్లో పొత్తులతోనే పోటీ చేయాలని ఇప్పటి నుంచే ఒట్టు పెట్టుకుని ముదుకు సాగేటంత బలంగా ఉంది. ఇదిలా ఉంటే టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇద్దరూ కేంద్రంలోని బీజేపీ పెద్దలతో ఎంతో సాన్నిహిత్యంగా ఉంటున్నారు. బాబు సైతం 2014 నుంచి 2019 మధ్యలో జరిగిన అనుభవాలతో బీజేపీ పెద్దల మనసెరిగి నడచుకుంటున్నారు అని చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ఇపుడు ఏపీలో కొత్త చర్చ స్టార్ట్ అయింది. దానిని స్టార్ట్ చేసిన వారు వైసీపీకి చెందిన సీనియర్ నేత మాజీ మంత్రి నెల్లూరు జిల్లాకు చెందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఆయన తాజాగా మాట్లాడుతూ జగన్ తప్పు చేశారని సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకోకపోవడం వైసీపీ చేసిన తప్పు అన్నారు. ఈసారి అవకాశం వస్తే పొత్తు పెట్టుకోవాలని సూచిస్తామని అన్నారు.ఇదిలా ఉంటే దేశంలో బీజేపీ అత్యంత బలంగా ఉంది. మోడీ ప్రజాకర్షణ నేతగా ఉన్నారు. పాక్ తో ఇటీవల జరిగిన పరిమిత స్థాయి దాడులు యుద్ధ వాతావరణం నేపథ్యంలో మోడీ మరింత బలోపేతం అయ్యారు. దేశ ప్రజలు మోడీని అత్యంత శక్తివంతమైన నేతగా చూస్తున్నారు. దాంతో ఈ ఇమేజ్ తో ఆయన మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తారని అంచనాలు ఉన్నాయి.ఇక వచ్చే ఎన్నికల్లోగా పాక్ తో ఒక మాదిరి యుద్ధం జరిగినా జరగవచ్చు అంటున్నారు. అదే కనుక జరిగితే మోడీ వెంటే దేశమంతా ఉంటుందని కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే మోడీతో బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలో చూస్తే మళ్ళీ బీజేపీ జనసేన టీడీపీ కూటమికి రాజకీయ వాతావరణం అనుకూలించే చాన్స్ ఉంది అని అంటున్నారు.దాంతో వైసీపీలో ఒక చర్చ జరుగుతోంది. దాని ఫలితమే నల్లపురెడ్డి తాజా కామెంట్స్ అని అంటున్నారు. బీజేపీతో మొదటి నుంచి స్నేహంగా ఉన్నది వైసీపీయే అని ఆ పార్టీలో వారు అనుకుంటున్నారుట. బీజేపీ పెద్దలు జగన్ తో ఎంతో సన్నిహితంగా ఉంటూ వచ్చారని చెబుతున్నారు. 2019 నుంచి 2024 మధ్యలో అయితే ఏకంగా ఎన్డీయే ప్రభుత్వంలో చేరమని రెండు మంత్రి పదవులు ఇస్తామని కూడా ఆఫర్ చేసినట్లుగా కూడా చెబుతున్నారు. ఇక డిప్యూటీ స్పీకర్ కూడా ఇస్తామని ఒక దశలో ప్రతిపాదించారని గుర్తు చేస్తున్నారు.అయితే మైనారిటీలు దళితులు ఇతర వర్గాల ఓటు బ్యాంక్ కి గండి పడుతుందని భావించే జగన్ బీజేపీతో పొత్తులకు దూరంగా ఉన్నారని అంటున్నారు. అయితే జగన్ వ్యూహం అంచనాలు తప్పు అయ్యాయని 2024 ఫలితాలు నిరూపించాయని అంటున్నారు. మైనారిటీలు ఎస్టీలు దళితులు టీడీపీ కూటమి వైపు మొగ్గు చూపడంతో చరిత్రలో కనీ వినీ ఎరగని తీరులో కూటమి 164 సీట్లను సాధించింది అని గుర్తు చేస్తున్నారు.మోడీ ఇమేజ్ ముందు ఇవన్నీ కొట్టుకుపోతున్నాయని అంటున్నారు. నిజానికి ఎన్డీయే కూటమిలో వైసీపీని చేరమని మహారాష్ట్రకు చెందిన కేంద్ర మంత్రి రాందాస్ అతవాలే వంటి వారు కూడా అనేక సార్లు చెప్పారని గుర్తు చేస్తున్నారు. అయితే వైసీపీ ఆఫర్లు అన్నీ వదిలేసుకుని ఇపుడు దిగాలుగా చూస్తోందని అంటున్నారు. వైసీపీ తటస్థ విధానం ఈ రోజున ఏపీ రాజకీయాల్లో అసలు పనికిరాదు అని ఆ పార్టీలో సీనియర్లు అంటున్నారుట.టీడీపీ కూటమి బలంగా ఉందని ఒంటరిగా వైసీపీ ఎన్నికలకు వెళ్తే ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పడం కష్టమని అంటున్నారు. మరి ఇవన్నీ బాగానే ఉన్నాయి కానీ వైసీపీ వదిలేసుకున్న చాన్స్ ని టీడీపీ ఒడుపుగా పట్టుకుంది.

## ఆపరేషన్ సిందూర్ వేళ పాకు దుస్సాహసం

న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ జోరుగా జరుగుతున్న వేళ పెద్ద సంఖ్యలో ఉగ్రమూకలను భారత్‌లోకి పంపేందుకు పాక్ యత్నించింది. సరిహద్దు వెంబడి భారత్‌లోకి జొప్పించే ప్రయత్నం చేయగా భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. దీంతో ఉగ్రమూకలు భారత్‌లోకి రాకుండా అడ్డుకట్ట పడింది. ఈ విషయాన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ధ్రువీకరించింది. మే 8వ తేదీన 45-50 మంది ఉగ్రవాదులను సరిహద్దులు దాటించి భారత్‌లోకి పంపించేందుకు పాక్ దళాలు తీవ్రంగా యత్నించాయి. ఇందుకోసం భారీగా షెల్లింగ్ కూడా చేపట్టినట్లు పేర్కొన్నాయి. బీఎస్ఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మండ్ ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'మా జవాన్లు వారికి తీవ్ర స్థాయిలో నష్టం కలిగించారు. పెద్ద ఎత్తున ఉగ్రవాదులు సరిహద్దులు దాటేందుకు వస్తున్నట్లు మా వద్ద ముందే సమాచారం ఉంది. వారి కోసం కాచుకు కూర్చొని.. గుర్తించగానే దాడులు నిర్వహించాం. ఆ గ్రూపులో దాదాపు 45-50 మంది వరకు ఉన్నారు. వారు మా వైపునకు వచ్చారు. దీంతో అదును చూసి వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాము. మేము ఊహించినట్లే తమ పోస్టుల నుంచి వారు భారీ స్థాయిలో కాల్పులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మేము అత్యంత కచ్చితత్వంతో కాల్పులు జరిపాము. దీంతో వారు తమ పోస్టులను వదిలేసి పలాయనం చిత్తగించారు. దాదాపు గంటన్నరలోనే వారికి మేము బుద్ధి చెప్పాము. వారి బంకర్లు, ఆయుధాలను ధ్వంసం చేశాము. వారు మరోసారి వస్తే పదింతల శక్తితో తిప్పికొట్టేందుకు మా జవాన్లు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలున్నాయి. బీఎస్ఎఫ్‌లోని మహిళా జవాన్లు కూడా పురుషులతో సమానంగా శత్రువులపై పోరాడే బాధ్యతలు నిర్వహించారు. వారిని చూస్తే మాకు గర్వంగా ఉంది' అని డీఐజీ వెల్లడించారు. బుధవారం పూంఛ్‌లోని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్లను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ వేళ జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ తిప్పికొట్టింది. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నట్లు బీఎస్ఎఫ్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి.

## పీకే కు పరీక్ష..

పాట్నా:బీహార్ శాసనసభ ఎన్నికలు వేగంగా కదులుతున్న ఋతుపవనాలను మించిన వేగంగా తరుము కొస్తున్నాయి. ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ సహజంగానే రాజకీయ వేడి పెరుగుతోంది. నిజానికి ఈ సంవత్సరం చివర్లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కేవలం బీహార్ కు మాత్రమే పరిమితమైన ఎన్నికలు కాదు. ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం దేశ రాజకీయ గతిని మార్చివేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా ఇంచుమించుగా ఒకదశాబ్ద కాలానికి పైగా దేశ రాజకీయాల్లో ప్రముఖంగా వినిపించిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్థాపించిన జన సురాజ్ పార్టీ కి పరీక్ష నిలిచే ఈ ఎన్నికలు, కులగణనను రాజకీయ తారక మంత్రాన్ని నమ్ముకున్న రాహుల్ గాంధీకి అగ్ని పరీక్షగా నిలుస్తాయని అంటున్నారు. వివరాల్లోకి వెళితే .. బీహార్ శాసన సభ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాష్ట్ర రాజకీయం వేడెక్కుతోంది. ఈ సంవత్సరం చివర్లో, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎన్నికల జరుగనున్న రాష్ట్రంలో అధికారాన్ని నిలుపుకునేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి, అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి పోటీ పడుతున్నాయి. మరో వంక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన సురాజ్ పార్టీ తొలి సారిగా ఎన్నికల బరిలో దిగుతోంది. సో , ఇంతవరకు రాజకీయ పార్టీలకు ఎన్నికల పాఠాలు చెప్పిన ప్రశాంత్ కిశోర్ కు ఈ ఎన్నికలు పరీక్ష కానున్నాయి.అదలా ఉంటే.. కాంగ్రెస్ అధినాయకుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పదే పదే వల్లె వేస్తున్న,కాంగ్రెస్ పార్టీ పునర్జీవనానికి తారక మంత్రంగా భావిస్తున్న కులగణన ప్రభావం జాతీయ రాజకీయాలపై ఏ మేరకు ఉంటుంది అనేది కూడా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తేలిపోతుందని అంటున్నారు. కులగణనకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు బీహార్ అసెంబ్లీ ఎన్నికలే కావడంతో దేశ భవిష్యత్ రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతుందని అంటున్నారు. ముఖ్యంగా భారత్, పాకిస్తాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమ ఖాతాలో వేసుకున్నట్లుగా,కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం క్రెడిట్ మొత్తాన్ని తమ ఖాతాలో వేసుకున్న రాహుల్ గాంధీకి బీహార్ అసెంబ్లీ ఎన్నికలు అగ్నిపరీక్ష కాగలవని పరిశీలకులు అంటున్నారు..కాగా.. జన్‌సురాజ్ పార్టీ గత ఏడాది నాలుగు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల బరిలో దిగింది. నాలుగు స్థానాలలోనూ ఓడి పోయింది. అంతే కాదు ఒక్క సీటు మినహా మిగిలిన మూడు నియోజక వర్గాల్లో డిపాజిట్ కూడా కోల్పోయింది. అయితే తొలి ప్రయత్నంలోనే పది శాతం ఓట్లు తెచ్చుకుంది. జన సురాజ్ పది శాతం ఓట్లు పట్టుకు పోవడం కమలానికి కలిసొచ్చింది. బీజేపీ తమ సిట్టింగ్ సీటు (ఇమామ్‌గంజ్)తో పాటుగా ఇండియా కూటమి మూడు సిట్టింగ్ స్థానాలు (తరారి, రామ్‌గఢ్, బెలగంజ్) మొత్తం నాలుగు స్థానాలను గెలుచుకుంది. సో.. ఇదే లెక్క రేపటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ పనిచేస్తే.. ఎన్డీఏ గెలుపు సులువు అవుతుంది.

## ప్రమాదానికి అసలు కారణం ఇదే

హైదరాబాద్, మే 22: గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై అసలు నిజాలను బయటపెట్టారు ఫైర్ అధికారులు . ఇన్వర్టర్‌లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణం గానే గుల్జార్ హౌస్‌లో మంటలు చెలరేగినట్లు అధికారులు నిర్ధారించారు. అగ్ని ప్రమాదం జరిగిన టైంలో ఇంట్లో రెగ్యులర్ కరెంట్ ఆఫ్‌లో ఉందని.. ఇన్వర్టర్ ద్వారా సెకండరీ పవర్ సప్లై మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌తో పాటు నాగపూర్‌కు చెందిన ఫైర్ ఫోరెన్సిక్ ఇంజనీర్లు నిర్ధారించారు. ఫైర్ ఎక్స్‌పర్ట్‌ల ఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి నివేదికను ఫైర్ డీజీకి అందించనున్నారు.మరోవైపు అగ్ని ప్రమాదం జరిగాక పొగ ఎక్కువ అవడంతో కుటుంబ సభ్యులు బయటకి రాకుండా రూమ్‌లోనే ఉండి తలుపులు వేసుకున్నారు. దీంతో పొగను పీల్చి ఊపిరి ఆడకుండా పడిపోయారు. ఈ ప్రమాదంలో ఊపిరి ఆడక పోవడం వల్లే వారంతా చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. త్వరలో ఘటన స్థలానికి ఓఎన్‌జీసీ కంపెనీ బృందాలు వెళ్లనున్నాయి.కాగా... ఈనెల 18 (ఆదివారం) తెల్లవారుజామున పాతబస్తీలోని గుల్జార్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొన్నేళ్లుగా ప్రహ్లాద్ మోదీ తన కుటుంబ సభ్యులతో కలిసి గుల్జార్ హౌస్‌లో నివాసం ఉంటున్నారు. ముందు రోజు ఓ వేడుకకు హాజరైన కుటుంబసభ్యులంతా అంతా కలిసి ఇంట్లోనే నిద్రించారు. ప్రమాద సమయంలో మొత్తం 21 మంది ఉన్నారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు నిద్రలో ఉన్నారు. దీంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

# ఐఏఎస్‌లా? పాదదాసులా? సీఎంలకు ఆ పాదాభివందనాలేంటి?




హైదరాబాద్, భారత దేశంలో అఖిల భారత సర్వీసు అధికారులకు గౌరవం, మర్యాదలు ఉన్నాయి. అఖిల భారత సర్వీసులో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌వోలు రాష్ట్ర సర్వీసులలో పనిచేస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా కొందరు ఐఏఎస్‌లు ప్రవర్తిస్తున్న తీరు వారి హోదాను, హుందాతనాన్ని పలుచన చేస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్లు, దఫేదార్లు నయం. కనీసం వారి విధి నిర్వహణ వరకూ పరిమితమవుతారు. కానీ.. పలువురు ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రుల కాళ్లు మొక్కుతున్నారు. అదేదో నాలుగు గోడల మధ్య ఇద్దరు ఉన్నప్పుడు ప్రవర్తిస్తే ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ బహిరంగంగా వేల మంది చూస్తుండగా సాష్టాంగపడిపోతున్నారు. ఐఏఎస్‌ల పాదాభివందనాలు చూసి.. సాధారణ జనం ఛీ కొడుతున్నారు. ఇలాంటి వారు ప్రజలకు ఏం సేవ చేస్తారు? చట్టాలను ఎలా అమలు చేస్తారు? అంటూ మండిపడుతున్నారు. నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించగా, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు. రూ.12,600 కోట్లతో ప్రారంభించిన ఈ పథకం ద్వారా సుమారు 2.1 లక్ష మంది గిరిజన రైతులకు సోలార్ విద్యుత్ మోటర్లను అందించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి లబ్ధిదారులకు మంజూరు సర్టిఫికెట్లు ఇస్తున్న సందర్భంలో పక్కనే ఉన్న గిరిజన శాఖ ముఖ్య కార్యదర్శి ఏ శరత్ ఆయన కాళ్లు మొక్కడం సంచలనం రేపింది. హఠాత్పరిణామంతో ఖిన్నుడైన ముఖ్యమం త్రి.. ఆయనను వారించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు టీవీ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించి ఆశ్చర్యపోయారు. ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న అధికారి సాధారణ పౌరుడి మాదిరి కాళ్లు మొక్కడం ఏంటని ముక్కున వేలేసుకున్నారు. ఈ ఘటనపై చర్చించుకోవడం మినహా ఏమి చేయలేరు కదా.

### మొదలుపెట్టింది వెంకట్రామ్ రెడ్డి

ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఒకప్పటి సిద్ధిపేట జిల్లా కలెక్టర్ పరుపాటి వెంకట్రామ్ రెడ్డి కాళ్లు మొక్కే సంస్కృతికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ జిల్లాకు చెందిన వెంకట్రామ్ రెడ్డి గ్రూపు వన్ అధికారిగా ఎంపికై ఉమ్మడి రాష్ట్రంలో పలు జిల్లాల్లో పనిచేశారు. 2007 సంవత్సరంలో ఐఏఎస్ అధికారి (కన్ఫర్డ్)గా ఎంపికయ్యారు. ప్రత్యేక రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆశీస్సులతో సిరిసిల్ల, సిద్ధిపేట, సంగారెడ్డి జిల్లాలకు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2021 జూన్ నెలలో సిద్ధిపేట జిల్లా కలెక్టరేట్ భవనం ప్రారంభ సమయంలో తన నూతన చాంబర్‌లోని సీట్లో కూర్చునే ముందు వెంకట్రామ్ రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేసి, అక్షింతలు వేయించుకున్నారు. ఐఏఎస్ అధికారి అయి ఉండి కేసీఆర్ కాళ్లకు దండం పెట్టడంపై ప్రచార, ప్రసార సాధనాల్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ విమర్శలపై వెంకట్రామ్ రెడ్డి సమర్థించుకున్నారుగానీ.. కేసీఆర్ ఇలాంటి పద్ధతి సరికాదని అధికారిక ప్రకటన చేయలేదు. ముఖ్యమంత్రి తన తండ్రిలాంటి వారని, అలాంటి పెద్ద మనిషి కాళ్లు మొక్కితే తప్పేంటని ఆనాడు వెంకట్రామిరెడ్డి ఎదురు ప్రశ్నించారు. సిద్ధిపేట జిల్లా కలెక్టర్‌గా ఏకంగా ఏడు సంవత్సరాల పాటు పనిచేసి.. కేసీఆర్‌కు దగ్గరయ్యారు. తన ఉద్యోగానికి వీఆర్ఎస్ పెట్టి 2021లో బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

### కామారెడ్డిలో మొదటిసారి, మాచారంలో రెండోసారి

కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారి అయిన ఏ శరత్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అంతకు ముందు కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. జూన్ 2021లో కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ భవనాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. కలెక్టర్ సీట్లో ఆసీనులు కావడానికి ముందు శరత్ కేసీఆర్‌కు పాదాభివందనం చేశారు. ఆయన కూడా ఏమీ తడుముకోకుండా, వారించకుండా ఆశీస్సులు ఇచ్చారు. మొదటిసారి జరిగిన ఈ ఘటనను కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఖండించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ షబ్బీర్ అలీ కేంద్రంలోని డీవోపీటీ మంత్రికి ఫిర్యాదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలిసారి కావడం, తెలిసీ తెలియక చేశారని అనుకున్నారు. కాని అదే తీరును మరోసారి ప్రదర్శించి, జనాగ్రహానికి గురవుతున్నారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జ్ఞాపికను అందచేసిన తరువాత ఆయన కాళ్లకు దండపెట్టారు. పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాదాలను కూడా తాకే ప్రయత్నం చేయగా, ఆయన ముందుకు కదిలారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు రావడంతో చర్యలకు ఉపక్రమించారు.

### కాళ్లు మొక్కితే చర్యలు తప్పవు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు మరుసటి రోజు అనగా మంగళవారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు దిగజారి ప్రవర్తించొద్దని, విధుల పట్ల అంకితభావం, నిబద్ధతతో ప్రజల విశ్వాసం పొందాలని సూచించారు. అతిక్రమిస్తే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేయాల్సి వచ్చింది. ఇటీవలి కాలంలో కొంతమంది ఆల్ ఇండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారులు సమావేశాలు, సభల్లో హోదాకు తగని విధంగా చర్యలు, హావభావాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇలాంటి ప్రవర్తన ప్రజల్లో ఏఐఎస్ అధికారుల మీద నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది. ప్రజలతో సంబంధాల విషయంలోనూ, అత్యున్నత స్థాయి నైపుణ్యం, నిజాయతీ, నిబద్ధతను పాటించాల్సిన బాధ్యత కలిగి ఉండాలని, ఇది ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్య కాబట్టి, ఇకపై ఏ అఖిల భారత సర్వీసు అధికారులు అయినా, సమావేశాలు, సభల్లో మోకరిల్లడం, హావభావాలు ప్రదర్శించడం వంటి చర్యల నుంచి దూరంగా ఉండాలన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన అధికారిపై చర్యలు తప్పవని కే రామకృష్ణా రావు స్పష్టం చేశారు.

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారా?

మాచారం సభలో శరత్ కాళ్లు మొక్కిన ఘటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊహించలేదంటున్నారు. ఈ పరిణామం తరువాత సీనియర్ ఆఫీసర్లు ఆయన ముందు ప్రస్తావించారో లేదా స్వయంగా ఆదేశించారో తెలియదు కానీ చర్యలు మొదలయ్యాయి. ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు మంగళవారం సాయంత్రం ఘాటుగా ఉత్తర్వులు జారీ చేశారు.

# మావోయిస్టుల ఖేల్ ఖతమేనా?



హైదరాబాద్,భారత హోంమంత్రి అమిత్ షా బుధవారం నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణంతో మావోయిస్టు ఉద్యమం ఈ దేశంలో తుడిచి పెట్టుకుపోయినట్టే అని ప్రకటించారు. నిజానికి మావోయిస్టులు అలాంటి పరిస్థితుల్లో ఉన్నారా? నంబాల కేశవరావు మృతి మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బే. మునుపెన్నడు ఇంత పెద్ద విఘాతం పార్టీకి తగలలేదు. ఇప్పటివరకు మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య జరిగిన అనేక ఘర్షణల్లో పలువురు ముఖ్య నక్సలైట్ నాయకులు మరణించినప్పటికీ కేంద్రపార్టీ కార్యదర్శి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం ఇది మొట్టమొదటిసారి కాబట్టి దీన్ని పెద్ద దెబ్బగా పరిగణించాల్సిందే. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి మొదలైన నక్సలైట్ ఉద్యమం తెలంగాణకు వచ్చేసరికి ఉత్తర తెలంగాణ జిల్లాలు పట్టుకొమ్మలుగా మారాయి. ఈ ప్రాంతం నుంచే ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ , ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి విద్యార్థులు, మేధావులు అనేకమంది అజ్ఞాతం బాట పట్టిన విషయం తెలిసిందే. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేశవరావు ఉత్తరాంధ్రలో పుట్టి ఉత్తర తెలంగాణలో నక్సలిజం బాట పట్టారు.ఇప్పుడు కేంద్ర హోంమంత్రి ఎక్స్‌లో ప్రకటించినట్టుగా మొత్తంగా నక్సలైట్ ఉద్యమం ఈ బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌తో అంతరించినట్టేనా? ఇంకెవరు మిగిలి లేరా? హోం మంత్రి అమిత్ షా మరో మాట కూడా అన్నారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌గా తాము పిలుచుకుంటున్న ఆపరేషన్ పూర్తయినట్టేనని అందుకు సంతోషంగా ఉందని ప్రకటించారు. ఆయన మాటలు ఎంత వరకు నిజం. పోయిన వాళ్ళు పోగా ఉత్తర తెలంగాణ నుంచి ఉద్యమంలోకి వెళ్లిన ఇంకెంతో మంది జీవించే ఉన్నారు. ఇప్పుడు వాళ్లంతా ఏమయ్యారు. బుధవారం నాటి చర్యతో వాళ్లంతా ఉద్యమాన్ని వదిలేసి బయటికి వచ్చినట్టేనా? అనే చర్చ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాగుతున్నది. పీపుల్స్ వార్‌గా పార్టీ ఉన్నప్పుడు పులి అంజయ్య అలియాస్ సాగర్ ఎన్‌కౌంటర్ జరిగిన దశలో ఎన్‌కౌంటర్ల పరంపర జరిగి అనేక మంది రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు మృతి చెందారు. వారిలో దగ్గు రాయలింగు, సాయని ప్రభాకర్, గోపగాని అయిలయ్య,తదితరులు రాష్ట్ర కమిటీ స్థాయిలో పని చేసారు. అప్పుడు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ పేరిట రాష్ట్ర కమిటీ స్థాయి కలిగి ఉండేది. అయితే అప్పుడు నాయకత్వంలో కొనసాగిన అనేకమంది విప్లవ కారులు ఉద్యమంలో కొనసాగుతుండడం వల్ల ఎన్‌కౌంటర్‌ల ప్రభావం ఉద్యమంపై కనిపించలేదు. అలాగే 1990ల నాటి ఉద్యమ అనుకూల పరిస్థితుల ప్రభావం కూడా కొత్త రక్తం పార్టీలో వచ్చి చేరేందుకు ఉపకరించిందనే వాదన ఉండేది.కొయ్యూరు ఎన్‌కౌంటర్ జరిగిన నాడు పీపుల్స్ వార్ అత్యంత క్లిష్ట పరిస్థితిలోకి నెట్టివేయబడింది. అప్పుడు కీలక శ్రేణులుగా ఉండి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన నల్ల ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రం రెడ్డిసంతోష్‌రెడ్డిలు ముగ్గురూ ఎన్ కౌంటర్‌లో మృతి చెందారు. ఆ సమయానికి అనేక మంది జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకులు కూడా మృతిచెందడంతో పార్టీ తిరిగి నిలదొక్కుకోగలదా అనే అనుమానాలు తలెత్తాయి. కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో పనిచేసిన పీపుల్స్‌వార్ నుంచి పార్టీ గణపతి ,శ్యాం, సాగర్, మళ్ళ రాజిరెడ్డి, మల్లోజుల కోటేశ్వర్ రావుల సమిష్టి నాయకత్వంలోకి వచ్చేనాటికి దళాల నిర్మాణం, సాయుధ గెరిల్లాల శిక్షణ విషయంలో నంబాల కేశవరావు నాయకత్వంలో మిలిటరీ కమిషన్ ఏర్పడింది. పార్టీ యూనిటీ పీపుల్స్ వార్‌లో విలీనమైన తర్వాత పార్టీలోకి నారాయణ్ సన్యాల్ లాంటి నాయకులు వచ్చారు. ఇదే దశలో అక్కిరాజు హరగోపాల్, బుర్రి చిన్నన్న, చెరుకూరి రాజ్ కుమార్ తదితర నాయకులు కూడా ఎదగడం పార్టీలో నాయకుల కోసం వెదుక్కోవాల్సిన అవసరం రాలేదు.పీపుల్స్ గెరిల్లా ఆర్మీగా పీపుల్స్ వార్ రెండుమూడేళ్ళ వ్యవధిలోనే తన ప్లాటూన్ల నిర్మాణానికి పూనుకోవడానికి అప్పుడున్న నాయకత్వ సంఖ్య కారణం. ఆ రోజుల్లో నల్లా ఆది రెడ్డి, ముగ్గురు నాయకులు మృతి చెందిన నాడు ఉద్యమ సానుభూతిపరులు తమ తమ జిల్లాల్లో నాయకత్వ స్థాయికి ఎదిగిన వాళ్ళ గురించి చర్చించుకునేది. అయితే కటకం సుదర్శన్, గుండేటి శంకర్, అక్కిరాజు హరగోపాల్, మొన్న మృతిచెందిన చలపతి, జిల్లాల్లో పోలం సుదర్శన్ రెడ్డి, చెట్టి రాజపాపయ్య, శాఖమూరి అప్పారావు, బడే నాగేశ్వర్ రావు, బడే మురళి, యాపా నారాయణ వీళ్ళంతా ఒక్కొక్కరు మృతిచెందడం, నాయకత్వానికి ఎదగాల్సిన క్యాడర్ కొందరు లొంగుబాట పట్టడం ఇదంతా మావోయిస్ట్‌గా పార్టీ రూపుదిద్దుకున్న దశలో జరగడం నాయకత్వం వేళ్ళమీద లెక్కించే స్థాయికి తగ్గిందా అనుకునే అవకాశాన్నిస్తున్నది. ఇప్పుడు కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతూ మృతిచెందిన నంబాల కేశవరావుకూ ధీటైన మిలిటరీ పరిజ్ఞానం ఉన్న నాయకులు లోపల ఉన్నప్పటికీ పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఇప్పుడు కొనసాగుతున్నదనడం లో సందేహం లేదు.ఆంధ్రలో కీలక నేతలు వేళ్ళ మీద లెక్కించదగ్గవాళ్ళే ఉన్నారు. తెలంగాణలో ఇంకా యాభైకి పైగా రాష్ట్ర స్థాయి నాయకత్వంలోనూ కొనసాగుతున్నారు. కేంద్ర కమిటీలో ఇప్పటికీ పది మంది తెలంగాణ నాయకులు ఉన్నారని పోలీస్ వర్గాల అంచనా. కరీంనగర్ జిల్లా నుంచి ముప్పాళ్ళ లక్ష్మణ్ రావు, మళ్ళ రాజి రెడ్డి, మల్లోజుల వేణుగోపాల్, కడారి సత్యనారాయణ్ రెడ్డి,పుల్లూర్ ప్రసాద్ రావు మెదక్ జిల్లానుంచి కట్టచారు రాంచంద్రారెడ్డి, ఆదిలాబాద్ నుంచి మైలారపు ఆడెళ్ళు, వరంగల్ నుంచి కొంకటి వెంకటి, ముప్పిడి సాంబయ్య, గాజర్ల రవి, బడే చొక్కా రావు, శ్యాం ప్రసాద్ రెడ్డి, పవనాంద రెడ్డి వీరు కాకుండా పోలీస్ లెక్కల్లోకి వెళ్ళని కనీసం పదిమంది మవోయిస్ట్ ఉద్యమ నాయకత్వ స్థాయిలో ఉన్నారని ప్రచారం. దక్షిణ తెలంగాణలో కూడా హనుమంతుతో బాటు కనీసం పదిమంది రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులు ఉన్నట్లు సమాచారం. వీరుకాకుండా మిలిటరీ రంగ నిపుణుల్లో తక్కళ్ళపల్లి వాసుదేవ రావు లాంటి కీలక శ్రేణులు కూడా ఇంకా ఉద్యమంలో కొనసాగుతున్నారని బసవరాజు ఎన్‌కౌంటర్ అనంతర చర్చల్లో సానుభూతిపరులు మాట్లాడుకోవడం వినిపించింది.

## ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ముఠా

అనకాపల్లి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టును అనకాపల్లి పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి 150 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు.. 30 మందిపై కేసులు నమోదు చేశారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలపై మంగళవారం రాత్రి జిల్లా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై జిల్లా పోలీసులు గత రెండు రోజులుగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో అచ్యుతాపురం శివారులోని పలు అపార్ట్‌మెంట్లపై దాడి చేసి.. ఈ మోసాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అపార్ట్‌మెంట్లను ఈ ముఠా అద్దెకు తీసుకుని ఈ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించారు. హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన కీలక డేటాను పోలీసులు సేకరించారు. విదేశీయుల ఖాతాలను లక్ష్యంగా చేసుకుని ఈ సైబర్ మోసాలకు ఈ ముఠా పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అపార్ట్‌మెంట్లకు నెలకు రూ. 18 లక్షలు అ÷–దదెగా చెల్లిస్తున్నట్లు పోలీసులు విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ అరెస్టయిన వారంతా యువతి యువకులే కావడం గమనార్హం. స్థానిక పోలీసులతోపాటు సైబర్ పోలీసులు ఈ దాడిలో పాల్గొన్నారు.

## వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై కేసు

నంద్యాల, వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డలో కేసు నమోదు అయింది. ఎర్రగుంట్లకు చెందిన నాగ ప్రసాద్ ఫిర్యాదు నేపథ్యంలో భూమా కిషోర్ రెడ్డిపై ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాంసం దుకాణాల నుంచి కేజీ చికెన్‌పై రూ.25 అదనంగా వసూలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఖండించారు. అంతేకాదు మీడియా ముందుకు వచ్చి ఆమె వివరణ సైతం ఇచ్చారు. కానీ వైసీపీ మాత్రం ఈ ఆరోపణలను కొనసాగిస్తుంది.దీంతో టీడీపీ, వైసీపీ గ్రూప్‌ల మధ్య స్థానికంగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. దాంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకుంటుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రజలను తప్పుదోవ పట్టించడం ద్వారా ఉద్రిక్త పరిస్థితులకు వైసీపీ వర్గీయులు కారణమవుతున్నారంటూ నాగ ప్రసాద్.. పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేత భూమా కిషోర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అతడి అనుచరులు అంబటి మహేశ్వర్ రెడ్డి ,శివ శంకర్ రెడ్డి, మల్లికార్జున్, రుద్ర శివ నాగిరెడ్డి, ప్రతాపరెడ్డి ,అంబటి చంద్రశేఖర్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## శివకుమార్ కీలక వ్యాఖ్యలు

బెంగళూర్ :కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసు వ్యవహారం కర్ణాటక ప్రభుత్వానికి చుట్టుకుంటోంది. కేబినెట్‌లో కీలక నేత, హోంమంత్రి పరమేశ్వర సంస్థలపై బుధవారం నుంచి ఈడీ దాడులు చేస్తోంది.అలాగే మంత్రిని కూడా ప్రశ్నించారు. ఇక మంత్రికి సంబంధించిన విద్యాసంస్థలపై దాడులు గురువారం కూడా కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో గురువారం హోంమంత్రి పరమేశ్వరను డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరమేశ్వరకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రన్యారావు వివాహానికి హాజరైన పరమేశ్వర.. గిఫ్ట్ ఇస్తే తప్పేంటి? అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు పెళ్లిళ్లకు హాజరై బహుమతులు ఇవ్వడం సహజమేనన్నారు. ఇందులో భాగంగానే రన్యారావు పెళ్లికి కూడా గిఫ్ట్ ఇచ్చారని తెలిపారు. పెళ్లికి బహుమతి ఇవ్వడంలో తప్పేమీ లేదని చెప్పుకొచ్చారు.అయితే పరమేశ్వర విద్యాసంస్థ నుంచి రన్యారావుకు సంబంధించిన రూ.40 లక్షల క్రెడిట్ కార్డు బిల్లును ఎలా చెల్లించారంటూ ప్రశ్నించగా.. దీనికి తర్వాత సమాధానం చెబుతానని పరమేశ్వర చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ అంశంపై కూడా ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే రన్యారావు చేసిన పనికి ఏ రాజకీయ నాయకుడు మద్దతు ఇవ్వరని డీకే.శివకుమార్ అన్నారు. ఈడీ అంశాల్లో తాము జోక్యం చేసుకోవాలని అనుకోవడం లేదని క్లారిటీ ఇచ్చారు. రన్యారావు కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.ఇక విద్యాసంస్థలకు సంబంధించి గత ఐదేళ్ల ఆర్థిక వివరాలు ఇవ్వాలని ఈడీ కోరింది. దీంతో దర్యాప్తు అధికారులకు సహకరించాలని సిబ్బందికి మంత్రి పరమేశ్వర ఆదేశించారు. దర్యాప్తు అధికారులు ఒక యూనివర్సిటీని.. మూడు విద్యాసంస్థలను సందర్శించాయి. ఈ దర్యాప్తులో రన్యారావుకు సంబంధించిన రూ.40 లక్షల క్రెడిట్ బిల్లును చెల్లించినట్లుగా గుర్తించారు. ప్రస్తుతం మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అధికారులు దర్యాప్తు చేస్తున్నారుమార్చి 3న దుబాయ్ నుంచి బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో రన్యారావు పట్టుబడింది. ఆమె దగ్గర నుంచి రూ.12 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఆమె జైల్లో ఉంటోంది. అయితే ఆమెపై ఛార్జ్‌షీట్ వేయకపోవడంతో బుధవారం ఆమెకు కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే ఆమెపై విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నిరోధక చట్టం, 1974 చట్టం కింద అభియోగం మోపడంతో ఏడాది పాటు జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఏకస్వామ్యం.. ఎందుకలా?

హైదరాబాద్,వైసీపీ, టీడీపీ మధ్య పార్టీ నిర్మాణంలో చాలా తేడా. టీడీపీలో బహు నాయకత్వం వుంటుంది. ఇదే వైసీపీ విషయానికి వస్తే కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ ఏకస్వామ్యమే. ఇదే పార్టీ ఎదుగుదలకు అడ్డంకి. తెలుగుదేశం పార్టీలో అన్ని కులాలకు భాగస్వామ్యం వుంటుంది. పార్టీ తమదే అనే భావన వాళ్లలో వుంటుంది. కానీ వైసీపీ నిర్మాణంలోనే తేడా కనిపిస్తుంది. ఈ పార్టీ అధినేత మొదలుకుని, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తల వరకూ చూస్తే, ఏకస్వామ్యం కనిపిస్తుంటుంది.వైసీపీకి సంబంధించి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త అదేదో తమ సొంత సామ్రాజ్యంగా భావిస్తుంటారు. మరో నాయకత్వాన్ని ఎదగనివ్వరు. కాస్త ప్రజాదరణ కలిగిన నాయకుల్ని రానివ్వరు. ఒకవేళ ఎవరైనా ఉన్నా, ఏదో రకంగా పొగ పెట్టి పార్టీ నుంచి బయటికి సాగనంపే నాయకులు వైసీపీలో కోకొల్లలు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ పెత్తందారీతనం గురించి మాట్లాడుతుంటారు. నిజానికి ఆ లక్షణాలన్నీ తన పార్టీలో ఉన్నాయనే వాస్తవాన్ని ఆయన గ్రహించలేకపోతున్నారు. వైసీపీలో ప్రజాదరణతో సంబంధం లేకుండా, కేవలం వైఎస్ జగన్‌తో వ్యక్తిగత సాన్నిహిత్యం, సంబంధాలే తమకు ఎన్నిసార్లైనా టికెట్ ఇప్పిస్తాయనే భరోసా ఆ పార్టీ నాయకుల్లో వుంది. దీని నుంచి జగన్ బయట పడలేకపోతున్నారు.నిజంగా అందరినీ కలుపుకునే పోయే లక్షణాలు జగన్ మొదలుకుని, ఆ పార్టీ సమన్వయకర్తలకు వుండి వుంటే, కూటమి బలపడేది కాదు. వైసీపీ బలహీనతే కూటమి బలం.ఉదాహరణకు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, అలాగే ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ రూప్‌కుమార్‌రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, మరీ ముఖ్యంగా వైసీపీలో నంబర్ 2గా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డి, అన్నిటికి మించి సోదరి వైఎస్ షర్మిల తదితరుల్ని పోగొట్టుకోడానికి కారణం ఎవరో వైఎస్ జగన్

# కడప మహానాడు కమిటీల్లో తెలంగాణ టీడీపీ నేతలు.. సంకేతమదేనా?



కడప:తెలుగుదేశంపార్టీ ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడపలో నిర్వహించనున్న పార్టీ పండుగ మహానాడులో తెలంగాణ పార్టీ నేతలకు సముచిత స్థానం ఇచ్చింది. మహానాడు కోసం వేసిన 19 కమిటీలలోనూ తెలంగాణ తెలుగుదేశం నేతలకు స్థానం కల్పించింది. అంతే కాకుండా తెలంగాణ అంశాలపై కూడా ఈ మహానాడులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెబుతున్నారు. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, తీసుకొస్తానని చంద్రబాబు ఇప్పటికే పలు సార్లు బహిరంగంగా ప్రకటించారు. రాష్ట్రంలో పార్టీ క్యాడర్ చాలా బలంగా ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహించే నాయకులకే కొరత ఉందన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మహానాడులో తెలంగాణలో పార్టీ పటిష్టతపై కూడా చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. అందులో భాగంగానే మహానాడు కమిటీల్లో తెలంగాణ పార్టీ నేతలకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారంటున్నారు. మహానాడు ఆహ్వాన కమిటీలో తెలంగాణ మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు, తీర్మానాల కమిటీలో నన్నూరి నర్సిరెడ్డి, చిలువేరు కాశీనాథ్, సామ భూపాల్ రెడ్డికి స్థానం కల్పించారు. అలాగే వసతుల కమిటీలో పార్టీ క్రమశిక్షణ సంఘం సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సనగాల సాంబశివరావు, షేక్ అరిఫ్ లకు, మహానాడు వేదిక కమిటీలో నందమూరి సుహాసిని, నన్నూరి నర్సిరెడ్డికి అవకాశమిచ్చారు. భోజనాల కమిటీలో కూరపాటి వెంకటేశ్వర్లు, బండి పుల్లయ్య, అజ్మీరా రాజునాయక్, జనగాం నర్సింగరావు సభ్యులుగా ఉన్నారు. సోషల్ మీడియా కమిటీలో తెలంగాణ తెలుగుదేశం నేతలు తిరునగిరి జ్యోత్స్న, కాట్రగడ్డ ప్రసూన, ప్రకాష్ రెడ్డి, ఆర్థిక వనరుల కమిటీలో గద్దె పద్మావతి, నెల్లూరి దుర్గాప్రసాద్ కు చోటుకల్పించారు. వీళ్ళే కాకుండా ఇంకా అనేక కమిటీల్లో తెలంగాణ నేతలకు చంద్రబాబు అవకాశాలు కల్పించారు. అవకాశాలు కల్పించటమే కాకుండా తెలంగాణలో పార్టీ బలోపేతానికి మహానాడులో తీర్మానాలు కూడా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లోను సభ్యత్వ నమోదు కార్యక్రమం నిరాఘాటంగా జరుగుతునే ఉంది. పార్టీవర్గాల సమాచారం ప్రకారం తెలంగాణ తెలుగుదేశం పార్టీకి దాదాపు 4 లక్షల సభ్యత్వాలున్నాయి. కడపలో మహానాడు తర్వాత ఇక జాప్యం లేకుండా తెలంగాణలో పార్టీ పటిష్ఠతకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు గట్టిగా నిర్ణయించుకున్నారంటున్నారు. తెలంగాణలో ఎంపికచేసిన నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీకి గట్టి పట్టు ఉన్న రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ఈ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిం చాలని చంద్రబాబు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని తెలుగుతమ్ముళ్లు చెబుతున్నారు.

# మళ్లీ మళ్లీ మీటింగ్స్.. అరెస్ట్ నువ్వా నేనా?

హైదరాబాద్, 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడింది. అప్పటి నుంచీ అటాకింగ్ పాలిటిక్సే చేశారు గులాబీ బాస్. ఉద్యమాలు, సమ్మెలు, మానవహారాలు, రాజీనామాలు, ఉప ఎన్నికలతో ధూంధాం చేశారు. ప్రత్యేక రాష్ట్రంతో పవర్‌లోకి వచ్చాక కూడా ప్రతిపక్షాలపై అదే దూకుడు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లాగేసుకున్నారు. అక్రమ అరెస్టులతో అరాచకంగా పాలించారు. ధర్నా చౌక్ ఎత్తేశారు. ఉద్యమకారులను అణగదొక్కారు. పదేళ్లు బంగారు తెలంగాణ భ్రమ కల్పించారని అంటారు. కట్ చేస్తే

భయపడుతున్నారా?

ఫస్ట్ టైమ్ కేసీఆర్‌లో.. టన్నుల్లో భయం కనిపిస్తోందని అంటున్నారు. కాళేశ్వరం ఉచ్చు ఆయన మెడకు గట్టిగానే బిగుస్తోంది. తమ ముందు హాజరుకావాలంటూ కమిషన్ నోటీసులు ఇవ్వడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలుస్తోంది. కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు సైతం హడలిపోతున్నారట. అందుకే, మామా అల్లుల్లు వరుసబెట్టి మీటింగులు పెట్టుకుంటున్నారు. గంటల తరబడి వ్యూహాలు రచిస్తున్నారు. కాళేశ్వరం ఊబిలోంచి ఎలా బయటపడాలా అని మెదళ్లకు పదును పెడుతున్నారు. తెలంగాణ చాణక్యుడిగా పేరు గాంచిన కేసీఆర్‌లో ఇంతటి ఉలిక్కిపాటు ఇంతకు ముందెప్పుడూ చూడలేదని చెబుతున్నారు. ట్రబుల్ షూటర్‌గా ఇమేజ్ ఉన్న హరీశ్‌రావు గతంలో ఎప్పుడూ ఇంతగా హైరానా పడలేదని అంటున్నారు. ఆ ఇద్దరు మేధావులు.. కాళేశ్వరం కమిషన్ ముందు ఏం చెప్పాలి? ఎలా గండం నుంచి గట్టెక్కాలి? అంటూ తెగ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

ఈటల ఇరికిస్తారా?

మరోసారి ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో హరీశ్‌రావు ప్రత్యక్షమయ్యారు. మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. మే 20న ఇలానే ఫాంహౌజ్‌కు వెళ్లి కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అంటే, రెండు రోజుల గ్యాప్‌లో వాళ్లిద్దరూ అలా గంటల తరబడి చర్చలు జరిపారంటే.. ఎంతలా భయపడుతున్నారో తెలుస్తోందని అంటున్నారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపైనే ఇద్దరు నేతలు చర్చిస్తున్నట్టు సమాచారం. కేటీఆర్ సైతం వారి చర్చల్లో పార్టిసిపేట్ చేశారు. ముగ్గురు కలిసి కాళేశ్వరం స్కాం నుంచి బయటపడే వ్యూహాలు రచిస్తున్నారని తెలుస్తోంది. మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు సైతం కమిషన్ నోటీసులు ఇవ్వడంతో.. ఆయనేమైనా మనల్ని ఇరికిస్తారా? అనే అనుమానమూ వారిలో వ్యక్తం అవుతోందని అంటున్నారు. కేసీఆర్, హరీశ్‌రావులపై ఈటలకు పాత పగలు చాలానే ఉన్నాయంటున్నారు. తనను పార్టీ నుంచి వెళ్లగొట్టిన గులాబీ బాస్‌పై



రివేంజ్‌కు ఇదే కరెక్ట్ ఛాన్స్ అనుకుంటున్నారా? పదవుల కోసం మిత్రుడికి వెన్నుపోటు పొడిచిన హరీశ్‌రావుతో ఈటల ఆటాడుకుంటారా?

హరీశ్‌రావు హ్యాండిస్తారా?

ఈటలపైనే కాదు.. హరీశ్‌రావుపైనా కేసీఆర్ డౌట్ పడుతున్నారట. హరీశ్ బీజేపీలో చేరుతారంటూ ఈమధ్య కాలంలో భారీ ఎత్తున ప్రచారం జరుగుతోంది. వరంగల్ సభ తర్వాత అల్లుడు అలిగాడని అంటున్నారు. రేపోమాపో పార్టీని వీడిపోతారంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. అదే నిజమైతే? హరీశ్ వెళ్తూ వెళ్తూ మామను ఇరికించేస్తారా? కాళేశ్వరం కమిషన్ ముందు నిజాలన్నీ కక్కేస్తారా? అనే ఆందోళన కల్వకుంట్ల ఫ్యామిలీలో కనిపిస్తోందని టాక్. అందుకే, ఇటీవలే కేటీఆర్ స్వయంగా హరీశ్‌రావు ఇంటికెళ్లి మరీ గంటన్నర పాటు ఏకాంతంగా బుజ్జగించారని అంటున్నారు. ఆ తర్వాత కేసీఆర్ పిలిపించుకుని నచ్చజెప్పారు. ఇప్పుడు మరోసారి హరీశ్‌రావుతో కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ చర్చలు జరిపారు.

ముగ్గురి కళ్లల్లో భయం?

హరీశ్‌రావు పార్టీలోనే కొనసాగేలా ఒత్తిడి తెస్తున్నారా? కాళేశ్వరం గుట్టు బయటపెట్టొద్దని వేడుకుంటున్నారా? కమిషన్ ముందు ఏం చెప్పాలని చర్చిస్తున్నారా? ఆ ముగ్గురూ కలిసికట్టుగానే ఉన్నారా? ఇలా ఎవరికి తోచిన యాంగిల్ వాళ్లు ప్రచారం చేసేస్తున్నారు. సోషల్ మీడియాలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల టాపిక్ హాట్ హాట్‌గా సాగుతోంది. ఇంతకీ, మామ కళ్లల్లో ఆనందం కోసం అల్లుడు ఏం చెప్పబోతున్నారు? కాళేశ్వరం కమిషన్ ముందు కేసీఆర్ నోరు విప్పుతారా? ముగ్గురి కళ్లల్లో అరెస్ట్ భయం కనిపిస్తోందా?

# ధాన్యం రైతుల దైన్యం..రోజులతరబడి పడిగాపులతో నష్టం

నిజామాబాద్,జిల్లాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి రోజులు, వారాల తరబడిగా పడిగాపులుగాస్తున్నా హమాలీలు లేక తూకం వేయడం లేదు. కొన్నిచోట్ల తూకం వేసినా లారీలు రాక వడ్లు రైస్ మిల్లులకు తరలించలేకపోతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదాలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లతో పాటు మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ తరుణంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయి. పలుచోట్ల రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదకు కొట్టుకుపోయి రైతులకు నష్టం వాటిల్లుతోంది. యాసంగిలో రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పీఏసీఎస్, ఐకేపీ, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలోకొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.కాగా అనేక చోట్ల ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోంది. వరిసాగు చేసిన రైతులందరూ హార్వెస్టర్లతో పంట కోసి వడ్లను కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారు. కానీ హమాలీల కొరత వల్ల వడ్లు తూకం వేయలేక పోతున్నారు. స్థానిక కూలీలు ముందుకు రాకపోతుండగా బీహార్ కూలీలు వస్తేగాని వడ్లు కాంటా పెట్టలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు సరిపడినన్ని లారీలు రాకపోవడంతో కాంటా పెట్టిన వడ్ల సంచులను రైస్ మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో తరచు వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాలు జలమయమవుతున్నాయి. వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. కాంటాపెట్టి బస్తాల్లో నింపి రైస్? మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు నానిపో తున్నాయి. కొన్నిచోట్ల మూడు, నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండడంతో వడ్లు ఎండక మొలకలు వచ్చాయి. బుధవారం కురిసిన వర్షానికి పలు ప్రాంతఆల్లో రోడ్లమీద ఆరబోసిన వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కేంద్రాల నిర్వాహకులు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాలకు వడ్లు తీసుకువచ్చి చాలా రోజులవుతున్నా కాంటా పెట్టడం లేదని, అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అకాల వర్షం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతన్నను అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం దంచికొట్టింది. ఫలితంగా ధాన్యం కొనుగోలు సెంటర్ల వద్ద ఆరబెట్టిన, బస్తాల్లో నింపిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు కుంటాల, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తడిసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు బేల, జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బేల మండల కేంద్రంలోని మార్కెట్? యార్డులో ఉన్న జొన్నలు తడిసిపోయాయి.



దండేపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న వరి కుప్పల్లోకి నీరు చేరింది. కుప్పలపై ప్లాస్టిక్ కవర్స్ కప్పినా వరద కుప్పల్లోకి చేరింది. ధాన్యం కొనుగోళ్ల ఆలస్యమవడంతోనే సెంటర్ల వద్ద ఉన్న వడ్లు తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సరైన ఏర్పాట్లు చేయయకపోవడంతో అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయిందని ఆరోపిస్తున్నారు. లారీల కొరత కారణంగా తూకం వేసిన బస్తాలను రైస్ మిల్లులకు చేర్చకుండా కేంద్రాల్లోనే ఉంచడంతో అవి తడిసిపోయాయి. ఈదురు గాలులకు జన్నారం మండలంలో మండలంలోని తపాలపూర్ లో పలువురి ఇండ్ల రేకులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కరెంట్ సరఫరలో అంతరాయం ఏర్పాడింది. సిర్పూర్ టీ లోని సీడం రుకుంబాయి అనే మహిళ ఇంట్లోకి వరద చేసి వస్తువులు తడిసిపోయాయి. దహెగాం మండలంలో గాలివానకు కల్లాల్లోని వడ్లకుప్పలపై కప్పిన కవర్లు కొట్టుకుపోయి వడ్లు తడిసిపోయాయి. వనపర్తి జిల్లాలో రైతులు అరిగోస పడుతున్నారు. దాదాపు 15 రోజులుగా సెంటర్లకు తీసుకొచ్చిన వడ్లను కాంటా చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రధానంగా లారీల ఏజెన్సీలు సరిపడా వాహనాలను సమకూర్చకపోవడం, హమాలీల సమస్య తీవ్రంగా ఉండటంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. దాదాపు 15 రోజులుగా జిల్లాలోని గోపాల్‌పేట, రేవల్లి, పాన్‌గల్, వీపనగండ్ల, మదనాపురం మండలాల్లోని కొన్ని సెంటర్ల వద్ద కొనుగోళ్లు లేట్?అవుతున్నాయి. వడ్ల లోడ్?తో వెళ్తున్న లారీలు రోజులు తరబడి తిరిగి రాకపోవడంతో సెంటర్ల నిర్వాహకులు కాంటాలు వేయడం లేదు. నాలుగు రోజులుగా ఆయా సెంటర్ల పరిధిలో రైతులు వడ్లను కొనుగోలు చేయాలని ధర్నాలకు దిగారు. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ ఆయా ప్రాంతాల్లోని సెంటర్లను పరిశీలించారు. కొనుగోళ్ల అంశంపై ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావుఅధికారులతో సమీక్ష నిర్వహించారు. వడ్ల కొనుగోళ్ల ఆలస్యంపై సమీక్షలో ఆరా తీశారు. సెంటర్ల వద్దకు లారీలు ఎందుకు టైంకు రావడం లేదని ప్రశ్నించారు.

# కవిత విమర్శలపై కెటిఆర్ సమాధానం చెప్పాలి



హైదరాబాద్,బీఆర్ఎస్‌లో ముసలం తారాస్థాయికి చేరిందని ఎమ్మెల్సీ కవిత లేఖపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత రాసిన లేఖతో లుకలుకలు బయటపడ్డాయని చెప్పారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసి పనిచేస్తోందని తాము చాలాకాలంగా చెబుతున్న మాటలను కవిత సమర్థించారని అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి కేసీఆర్ సిద్ధమవుతున్నారని కవిత చెప్పకనే చెప్పిందన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీపైన పల్లెత్తు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహరించిన తీరును కవిత కడిగి పారేసిందని అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకోబోతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ బలహీనపడటం వల్లనే బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారని ఆది శ్రీనివాస్ చెప్పారు. 'కవిత పచ్చి నిజాలు చెప్పారని.. మేం చాలా కాలంగా చెబుతున్నాం. బీఆర్ఎస్‌లో కేసీఆర్ నియంతృ త్వ వైఖరీని కూడా కవిత నిలదీశారు. పార్టీ రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్ ఒక్కరే ప్రసంగించడాన్ని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్ వైఖరీని ఆయన కూతురే తప్పుపడుతోంది. ఇక ప్రజలకు వాళ్లేమీ సమాధానం చెబుతారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని కవిత తేల్చి చెప్పింది. పార్టీ నాయకులను కలవకుండా ఏకపక్ష పోకడలకు పోతున్నారని ఆమె చెప్పారు. కవిత లేఖపైన బీఆర్ఎస్ నాయకత్వం స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలి. మా సీఎం రేవంత్ రెడ్డి మీద ఒంటి కాలిపైన లేస్తున్న కేటీఆర్ ముందు తన చెల్లికి సమాధానం చెప్పాలి' అని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.. 'కవితకు సమాధానం చెప్పకుండా ఇతర పార్టీలను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు. కల్వకుంట్ల కుటుంబంలో లుకలుకలు ఉన్నాయి. మాజీమంత్రి హరీష్‌రావు అలగడంతో ఇంటికి వెళ్లి కేటీఆర్ బతిమాలాడు. కవిత లేఖతో బీఆర్ఎస్ ఇద్దరికి మాత్రమే పరిమితం అయిందని తేలింది. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో జరిగిన దోపిడి గురించి కూడా కవిత ప్రశ్నిస్తే బాగుంటుంది. పంపకాలు, పదవుల్లో తేడా వచ్చి కేసీఆర్ కుటుంబంలో లేఖలు రాసుకుంటున్నారు. బీఆర్ఎస్ పని ఇక అయిపోయింది. కేటీఆర్.. ముందు నీ ఇళ్లు సరిదిద్దుకో. అధికారంలో ఉన్నప్పుడు ఫామ్ హౌస్‌లోనే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యాడు. కేసీఆర్ తీరును ఆయన కూతురే తప్పుపడుతోంది. ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలి' అని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# పాక్ నిఘా కార్యకర్తలతో సంభాషణ..ఉగ్రవాదులతో లింక్ మాత్రం లేదు



న్యూఢిల్లీ,:యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు ఉపశమనం లభిస్తోంది. పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో జ్యోతి సంప్రదింపులు జరిపిందని, అయితే, ఉగ్రవాదంతో ఆమెకు ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు తేల్చారు. జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ నిఘా కార్యకర్తలతో తెలిసి సంభాషించినప్పటికీ, ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలు లేదా గ్రూపులతో సంబంధం ఉందని ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, సాయుధ దళాల గురించి లేదా వారి ప్రణాళికల గురించి మల్హోత్రాకు ఎటువంటి అవగాహన లేదని హిసార్ పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. ఆమె కాంటాక్ట్‌లలో కొందరు పాకిస్తానీ నిఘా కార్యకర్తలని తెలిసినప్పటికీ, ఆమె వారితో టచ్‌లో ఉందని ఆయన అన్నారు.'ఇప్పటివరకు, ఆమె ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు లేదా ఏదైనా ఉగ్రవాద సంస్థతో ఆమె అనుబంధానికి సంబంధించిన ఆధారాలు మాకు దొరకలేదు. ఆమె ఏదైనా ఖఎక్షలను వివాహం చేసుకోవాలనుకుంటున్నట్లు లేదా మతం మార్చుకోవాలనుకుంటున్నట్లు చిత్రీకరించే ఏ పత్రాన్ని మేము కనుగొనలేదు' అని ఎస్పీ చెప్పారు. మల్హోత్రాకి చెందిన మూడు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, వీటితోపాటు, మే 18న అరెస్టయిన వీసా ఏజెంట్ హర్కిరత్ సింగ్‌కు చెందిన రెండు మొబైల్ ఫోన్‌లను విశ్లేషణ కోసం ల్యాబ్స్‌కు పంపినట్లు ఎస్పీ వెల్లడించారు. 'జ్యోతి మల్హోత్రా ఐదురోజుల రిమాండ్‌లో ఆమెను కొన్ని కేంద్ర సంస్థలు విచారించాయి, కానీ ఆమె కస్టడీని మరే ఇతర ఏజెన్సీకి ఇవ్వలేదు. పబ్లిక్ డొమైన్‌లో వస్తున్నట్టు ఆమె 'డైరీ'లోని పేజీలు మా దగ్గర లేవు. తమ దగ్గర ఎటువంటి డైరీ లేదు,' అని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలా ఉండగా, 33 ఏళ్ల ట్రావెల్ బ్లాగర్ అయిన జ్యోతి మల్హోత్రాను మే 16న పాకిస్తాన్ కార్యకర్తలతో సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారనే ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆమెపై అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3,5 ఇంకా భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 152 కింద కేసు నమోదు చేశారు. రిమాండ్ కాలంలో ఆమెను, జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు ప్రశ్నించారు.

### పేలుళ్ల కుట్ర కేసులో నిందితులకు పోలీస్ కస్టడీ

విజయనగరం, విజయనగరం పేలుళ్ల కుట్ర కేసులో నిందితులను వారం పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ విజయనగరం జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పేలుళ్ల కుట్ర కేసులో నిందితులు సిరాజ్, సమీర్‌ను అరెస్టు చేసిన పోలీసులు లోతైన విచారణకు నిందితులను 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

# జూన్‌లో తల్లికి వందనం అమలు...

నెల్లూరు,ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను కూటమిప్రభుత్వం ఒక్కటిగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో 'తల్లికి వందనం', 'మహిళలకు ఉచిత బస్సు' పథకాలకు డేట్స్ ఫిక్స్ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా జూన్ నుంచి తల్లికి వందనం, ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తాం అని మంత్రి నారాయణ చెప్పారు. మరోవైపు పాఠశాలలు మొదలుపెట్టే రోజున తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తామని ఆత్మకూరులో జరిగిన మినీ మహానాడు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. విద్యార్థుల సంక్షేమం కోసం తల్లికి వందనం పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకం రాష్ట్రంలో విద్యావ్యవస్థలను బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేస్తుంది. ఈ క్రమంలో 'తల్లికి వందనం' పథకంపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కీలక ప్రకటన చేశారు. పాఠశాలలు మొదలుపెట్టే రోజున 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తామని ప్రకటించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు. ఆత్మకూరులో గురువారం మినీ మహానాడు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనిమిది తీర్మానాలను మంత్రి ఆనం ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలకు అండగా ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర కొనసాగిందని చెప్పారు. ఆత్మకూరులో సీఎం చంద్రబాబు రెండుసార్లు పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సోమశిల డ్యాం మరమ్మతులకు రూ.175 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుదేనని గుర్తుచేశారు. డ్యాం మెయింటెనెన్స్‌కి గ్రీసు కూడా ఇవ్వని స్థితిలో గత వైసీపీ పాలన సాగిందని



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. ఆత్మకూరులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల నుంచి 150 పడకలకు పెంచామని చెప్పుకొచ్చారు. సోమశిలలో 30 పడకల ఆస్పత్రిని సీఎం చంద్రబాబు మంజూరు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అమలు కాబోతున్నాయని స్పష్టం చేశారు. గతంలో పదివేల సభ్యత్వాలు కూడా లేని పరిస్థితుల నుంచి ఈరోజు లక్ష 50 వేల సభ్యత్వాలు చేసి రాష్ట్రంలో మూడో స్థానంలో నెల్లూరు జిల్లా నిలిచిందని అన్నారు. శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలో రెండోస్థానంలో ఆత్మకూరు నియోజకవర్గం నిలిచిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ కోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలే పార్టీకి బలమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అనుభవం ఉన్న నేత అని కొనియాడారు. ఆత్మకూరులో రూ.450కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. సోమశిల ప్రాజెక్ట్, రోడ్లు, కాలువలు వంటి చాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆత్మకూరుకు మరిన్ని నిధులు తీసుకురావడానికి తనవంతుగా కృషి చేస్తానని... అభివృద్ధి ఇలాగే కొనసాగాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com